# పరిచయము

## శీర్షిక

హెబ్రీ లేఖనముల మొదటి పుస్తకము యొక్క శీర్షిక "జెనెసిస్" (ఆదికాండము). ఆంగ్ల శీర్షిక లాటిన్ వల్గేట్ జెనెసిస్ నుండి పొందినది. ఇది సెప్టూజంట్[1] లోని γένεσις యొక్క లిప్యంతరీకరణమైయున్నది. పవిత్ర రచనలకు వాటిలోని మొదటి పదమునుబట్టి నామకరణము చేయడము అనేది యూదుల యొక్క పద్ధతి; కనుక ఈ పుస్తకము యొక్క హెబ్రీ నామము בְּרֵאשִׁית, (*Bere'shith*) "ఆదియందు" అని సాంప్రదాయకముగా అర్థము చెప్పిరి.

## రచయిత మరియు వ్రాయబడిన కాలము

ఆదికాండము యొక్క రచయిత మరియు వ్రాయబడిన కాలము యొక్క అంశములు కఠినాంశాలుగా ఉన్నాయి. రచయిత ఎవరో లేక అతను దీనిని ఎప్పుడు రచించేనో అను విషయములు ఈ పుస్తకము మనకి చెప్పుటలేదు. పురాతన రచయితలూ తమ రచనలను సంకలనము చేయుటకు కొన్ని మారులు వివిధములైన మూలములను వినియోగించేవారని, పాతనిబంధనలోని అనేక వాక్యభాగములనుండి మనకు తెలియుచున్నది. ఈ రచయితలూ, అప్రమాణిక రచనలనుండి కూడా వాక్యములను తీసికొని తమ రచనలలో వాడుకొనేవారు: సంఖ్యాకాండము 21:14, 15లో "యెహోవా యుద్ధముల గ్రంథము" నుండి వాక్యభాగములను రచయిత ఉన్నది ఉన్నట్లుగా తీసికొని తన రచనలో వాడుకొనెను; మరియు యెహోషువ 10:13లో, యెహోషువ యొక్క విస్తరించిన దినమును గూర్చిన వాక్యమును రచయితా "యాషారుగ్రంథము"లో నుండి తీసికొనెను. అదనముగా, గిల్బోవ పర్వతముపై రాజైన సౌలు మరియు అతని కుమారులను గూర్చి దావీదు చేసిన విలాపము యొక్క మూలము కూడా "యాషారు గ్రంథము" అని 2 సమూయేలు యొక్క రచయిత తెలియజేసెను (2 సమూ. 1:18–27). 1, 2 రాజులు; 1, 2 దినవృత్తాంతములు; ఎజ్రా; మరియు నెహెమ్యా గ్రంథములను రాసిన రచయితలు కూడా ఆ పుస్తకములను వ్రాయునప్పుడు అనేకమైన యితర దైవ ప్రేరితము కాని గ్రంథములనుండి తీసికొని వ్రాసిరి.

క్రొత్తనిబంధనలో, రచయిత అయిన లూకాకు క్రీస్తు యొక్క జీవితమును గూర్చి ప్రాథమిక జ్ఞానము లేదు కానీ, తన సువార్తను రచించుటలో మౌఖిక మరియు లిఖిత మూలములను కూడా ఉపయోగించుకొనెనని తెలియజేసెను (లూకా 1:1–4). రచయితలూ జరిగిన సంఘటనలకు ప్రత్యక్ష సాక్షులు కానప్పుడు మరియు దేవుని నుండి నేరుగా (ప్రవక్తలు పొందుకొనినట్లుగా) బయల్పాటు పొందుకొననప్పుడు, లేఖనములను రచించుట కొరకు రెండవ మూలములను ఉపయోగించునట్లు, పరిశుద్ధాత్మ కొన్నిసార్లు వారిని ప్రేరేపించెను.

ఆదికాండము యొక్క రచయితను దేవుడు ప్రేరేపించెను, మరియు తదనంతర తరములన్నిటి కొరకు ఈ పుస్తకము భద్రము చేయబడియున్నది. “మోషే సీనాయి పర్వతముపై ధర్మశాస్త్రమును పొందుకొనెను” అని ఆదికాండము యొక్క రచయితను గూర్చి యూదుల యొక్క ఆది సాంప్రదాయములలో ఒకటి చెప్పుచున్నది.[2] ధర్మశాస్త్రము అనగా, కేవలము బైబిలులోని మొదటి పుస్తకము అని మాత్రమే కాక పంచకాండములోని మిగిలిన పుస్తకములు కూడా అని అర్థము చేసికొనబడినది – నిర్గమకాండము, లేవీయకాండము, సంఖ్యాకాండము, మరియు ద్వితీయోపదేశకాండము.[3] “మోషే యొక్క ధర్మశాస్త్రము [లేక ‘గ్రంథము’]” అని బైబిలులోని అనేక వాక్యభాగములలో ఈ సంపుటము పిలువబడినది.[4]

ఇశ్రాయేలీయులతో అరణ్యములో నలువది సంవత్సరములు గడిపినందున, పంచకాండమును రచించుటకు మోషేకి నిశ్చయముగా సమయము ఉండెను. “ఐగుప్తీయుల సకల విద్యలను అభ్యసించి” (అపొ. 7:22) యుండినవానిగా, ఈ కార్యమునకు అవసరమైన విద్యా నేపథ్యము కూడా అతనికి ఉండెను. ఒక అతిశ్రేష్ఠమైన ప్రవక్తగా (ద్వితీ. 34:9, 10), అతను ఖచ్చితముగా దేవుని నుండి అనేక ఆజ్ఞలను మరియు కట్టడలను పొందుకొని, వాటిని రచించెను (నిర్గమ. 24:4; ద్వితీ. 31:9). అదనముగా, ఇశ్రాయేలీయులు బస చేసిన స్థలములను గూర్చియు మరియు అక్కడ జరిగిన సంఘటనలను గూర్చియు, అతను ఒక యాత్ర పుస్తకమును భద్రము చేసెను (నిర్గమ. 17:14; సంఖ్యా. 33:2–37), మరియు, కనీసము ఒక కీర్తనను భద్రము చేసెను (ద్వితీ. 31:22). 90వ కీర్తన కూడా మోషే రచించెనని భావిస్తారు. అయితే, ఏ లేఖన భాగాములైతే మోషే రచించెనని చెప్పుదురో ఆ పంచకాండమునకు మాత్రమే మోషే చేసిన సేవలు పరిమితమైనవి కావు. ఏలయనగా, అత్యధికమైన సంఘటనలలో ప్రత్యక్ష సాక్షిగా మరియు పాలుపొందినవానిగా, సాధారణముగానే, యూదులలో అతని మాటలకి ఎంతో ప్రాముఖ్యత ఉండినది.

పంచకాండములోని ఇతర పుస్తకములు, వాటిలోని ఏదో కొంత భాగమును మోషే రచించేనని తెలియజేయుచుండగా, దీనికి విరుద్ధముగా, ఆదికాండములోని ఏ వాక్యభాగము కూడా, ఆ పుస్తకము యొక్క ఏ భాగమునకైనను అతను

రచయితా అని చెప్పుటలేదు. అదనముగా, ఆదికాండములోని కొన్ని వాక్యభాగములు మోషే తదనంతర కాలమునకు చెందినవిగా అనిపించుచున్నవి. ఉదాహరణకు, కానాను దేశములోని షెకెమునకు అబ్రాహాము యొక్క రాకను గూర్చి వివరించుచున్నప్పుడు, "అప్పుడు కనానీయులు ఆ దేశములో నివసించిరి" అను పదములను రచయితా ఉపయోగించెను (12:6). ఈ ప్రతిపాదన చేసిన రచయిత/సంపాదకుడు, మోషే కాలము తరువాత, వాగ్దాన భూమిలో కనానీయులు ఏ మాత్రము జీవించని మరియు దానిని నియంత్రించని కాలములో జీవించెనని, ఈ వాక్యము సూచించుచున్నట్లు అనిపించుచున్నది.

మరియొక వాక్యభాగము, మెసొపొతమియ యొక్క నలుగురు రాజులు యొర్దాను లోయపై జరిగించిన దాడిని గూర్చి చెప్పుచున్నది. అబ్రాహాము వారిని తరిమికొట్టి తన సైన్యములో వారిని "దానుమట్టుకు" వెంతాదేనని ఈ వాక్యభాగము చెప్పుచున్నది (14:14). అయితే, న్యాయాధిపతుల గ్రంథము యొక్క రచయిత ప్రకారము, ఈ పట్టణము యొక్క మునుపటి పేరు లాయిషు; దాను గోత్రమువారు న్యాయాధిపతుల యొక్క తదుపరి కాలములో దానిని పట్టుకొనకమునుపు వరకు దానిని "దాను" అను పేరు ఇవ్వబడియుండలేదు (న్యాయాధి. 18:27–29).

ఆదికాండములోని ఇతర వాక్యభాగములలో వెలసే (11:28, 31; 34:7; 36:31, వంటివి) ఈ వాక్యభాగములలోని స్పష్టమైన కాల(గణన)దోషములు బహుకాలముగా గుర్తించబడినవి. మోషే కాలము తరువాత కొన్ని సంపాదకపరమైన మార్పుచేర్పులు చోటుచేసికొనినవాణి ఈ ఆధారములు సూచించుచున్నవి. అయితే, ఈ మార్పుచేర్పులు ఏ విధముగాను లేఖనముల యొక్క ప్రేరేపణను గానీ, వాటి అధికారమును గానీ, లేక క్రీ.పూ. పదిహేనవ శతాబ్దము నుండి పదమూడవ శతాబ్దము మధ్య ఆదికాణ్డము మోషే రచించెనను సాంప్రదాయకమైన అభిప్రాయమును గానీ బెదిరించుటలేదు.[5]

ఆదికాండము యొక్క రచన ఇప్పుడు మనకు అందుబాటులో ఉన్న రీతిలో ఖచ్చితముగా ఏ విధముగా రూపుదిద్దుకొనినాదో అను విషయముపై మనము నిశ్చయతతో మాట్లాడలేము. అయినప్పటికీ, మోషే, లేక మోషే యొక్క ఆధ్వర్యములో ఎవరైనా (యెహోషువ వంటివారు), ఈ పుస్తకమును రచించుటకు – మౌఖిక లేక రచనా – మూలములను ఉపయోగించి ఉండవచ్చు.[6] తదుపరి కాలములో, ఒక రచయిత/సంపాదకుడు,[7] పరిశుద్ధాత్మ యొక్క నడిపింపు క్రింద, తన సమకాలీన చదువరులకు అర్థమయ్యే విధముగా కొన్ని పేర్లు మరియు స్థలములను నవీకరించెనని తేటపడుచున్నది.

అయితే, మోషే కాలమునకు అనేక వందల సంవత్సరముల తరువాత, కొందరు తార్కికవాడ బైబిలు విమర్శకులు, సంపాదకీయ మార్పుచేర్పులను, వాటితో పాటు పరిణామాత్మక భావాలను (evolutionary ideas) వేదాంత అభివృద్ధిని ఉపయోగించి, దానితోపాటుగా పరిశుద్ధ లేఖనముల దైవప్రేరేపణ

మరియు అధికారములను నిరాకరించి, ఆదికాండముకు (మరియు పంచకాండములోని ఇతర పుస్తకములకు) ఊహాత్మక మూలములను నిర్మించిరి. ఈ "మూల విమర్శకుల" లో (source critics) అనేకుల ప్రకారము, పితరులు మరియు మోషే యొక్క కథనములు, ఏ మాత్రము చారిత్రిక వాస్తవములపై ఆధారపడని పురాణ కల్పిత గాధలపై నిర్మించబడినవి.

"వ్రాతరూపకమైన పరికల్పన" (Documentary Hypothesis) యొక్క వివరణాత్మక విశ్లేషణను ఇచ్చుట ప్రస్తుత వ్యాఖ్యానము యొక్క పరిధిని మించినది; కానీ, ఆదికాండము యొక్క వ్యాఖ్యానములోని కొన్ని ముఖ్య సందర్భములలో, ఈ సిద్ధాంతము యొక్క బలహీనతలను, వ్యాఖ్యానములలో చూపడము జరుగుతుంది. బైబిలులోని మొదటి పుస్తకము యొక్క ప్రాథమిక ఐక్యత మరియు యధార్ధ్యమును అణగద్రొక్కుటకు విమర్శకులు ఏంటో దూరము వెళ్లియున్నారు. అయితే, ఆదికాండము మరియు పంచకాండములోని అత్యధిక భాగము చట్టబద్ధముగా మోషే ద్వారా ఎందుకు వ్రాయబడలేదో చూపించుటకు వారు ఏ బలమైన ఋజువును కూడా ముందుకు తీసికొనిరాలేదు. వారి సిద్ధాంతము ప్రాథమికముగా, ఎటువంటి నిష్పాక్షిక బాహ్య పద్ధతుల ద్వారా ధృవీకరించలేని అనుమానాస్పదమైన ముందుగా ఊహించినటువంటి ఊహలపై ఆధారపడి ఉంది.

ఆదికాండము యొక్క రచయిత మరియు దానిని రచించుటకు పరిశుద్ధాత్మ ఉపయోగించిన విధానము అనునవి, లేఖనానుసారమైన విశ్వాసము విషయములో ప్రాముఖ్యమైనవి కావని నమ్ముట సహేతుకమైనదే. ఏలయనగా, ఈ సమాచారమును బైబిలు మనకి ఇచ్చుటలేదు. మరొకవైపు, పురాతన చారిత్రిక ప్రతులు, చెక్కబడిన వ్రాతలు, మరియు ఇతర పురాతత్వశాస్త్రమునకు సంబంధించిన కళాఖండాల ద్వారా, పితరుల ప్రపంచమును గురించి మనము ఎక్కువగా నేర్చుకొనుచున్న కొలదీ, బైబిలులోని కథలు నిజమైనవనే వాస్తవమును గురించి మనము అంతకంతకు ఎక్కువగా గ్రహించినవారమౌటాము. అవి, యూదుల కొరకు ఒక మహిమకరమైన మరియు వీరోచితమైన చరిత్ర కలుగజేయు నిమిత్తము, కేవలము వీరులైన పురుషులు మరియు స్త్రీల కల్పిత పురాణ గాథలు కావు. ఇందుకు విరుద్ధముగా, ఆదికాండము యొక్క (మరియు పంచకాండము యొక్క) నిజమైన కథానాయకుడు దేవుడు. ఈయన సృష్టికర్తయైయుండి, పాపులైన మానవులను తన కృప ద్వారా పిలిచి, ఆశీర్వదించి, వారిలో లోపములు ఉన్నా కూడా వారిని వాడుకొనినవాడు. మానవజాతిని పాపము నుండి రక్షించుటకొరకు తన కుమారుని ఒకనాటికి వారి ద్వారా తెచ్చునట్లు, ఒక ప్రజను సృష్టించుట కొరకే ఆయన ఈ విధముగా చేసాడు.

ఆదికాండము, నిజాయితీ ఉన్నా కూడా తప్పుమార్గములో నడిపించబడ్డవ్యక్తుల వలన సృష్టించబడిన ఒక "భక్తిపూర్వకముగా కనిపించే

మోసపు కార్యము" (pious hoax) కాదు. అలా కాకపోగా, లోకము యొక్క "ఆరంభము," మానవ జాతి యొక్క సృష్టి, పాపము యొక్క ఆరంభము మరియు దాని పరిణామములకు, ఒకదానితో ఒకటి సంబంధమును కలిగించునటువంటి ప్రేరేపించబడిన దేవుని వాక్యముగా, ఆదికాండము ఉన్నది. ఆదికాండము ప్రాథమికముగా, మానవ చరిత్రలో దైవిక విమోచనమును గూర్చిన కథనము యొక్క ఆరంభమును తెలియజేయుచున్నది. ఈ కథనమే మిగిలిన బైబిలు అంతటిలో కొనసాగుచున్నది. ప్రకటన గ్రంథము ఈ కథనము యొక్క ముగింపును కలిగియున్నది. అందులో అన్ని కాలములలో విమోచించబడినవారిని గూర్చిన సన్నివేశము ఉన్నది – వారు ఏదేనుకు సంబంధించిన పరదేశులో లేరు. కానీ, వారు పరలోకపు పరదైసులో దేవుని సింహాసనము చుట్టూ చేరి, మోషే యొక్కయు మరియు గొర్రెపిల్ల (యేసు) యొక్కయు కీర్తన పాడుచు, దేవత్వములో ఏకమైయున్న ముగ్గురితోనూ (త్రిత్వముతో; triune God) మరియు ఆయన ప్రజలతోనూ ఎన్నటెన్నటికి సన్నిహిత సంబంధమును అనుభవించుచుందురు.

## విషయములు

### *Toledoth* విభజనలు

ఆదికాండమును పది భాగములుగా విభజింపవచ్చు. ప్రతి భాగము హెబ్రీ పదమైన תּוֹלְדוֹת (*toledoth* లేదా *tholedoth*), ప్రారంభమవుతుంది, ఈ పదమునకు "వృత్తాంతము," "వంశావళులు," "సంతతివారు," లేక "పితరుల వివరణ" అని భావము (2:4; 5:1; 6:9; 10:1; 11:10, 27; 25:12, 19; 36:1; 37:2 చూడుము). ప్రతి సందర్భములోను, తోలెదోత్ (*toledoth*) అను పదము ఒక పరిచయ వాక్యములో భాగముగా వాడబడినది. ఈ పరిచయ వాక్యములో ఆ భాగములోని తండ్రి లేక ప్రధాన వ్యక్తి గుర్తించబడియున్నాడు. ఇటువంటి తీరుకు 2:4లో మాత్రమే ఒక సాధ్యమైన మినహాయింపు ఉన్నది. 2:5–25కు ఆరంభముగా కాక, 1:1–2:3కు ముగింపుగా కొందరు భావిస్తారు. కొన్ని సందర్భములలో, తోలెదోత్ (*toledoth*) అను పదము ఒకే భాగములో మరలా మరలా వచ్చినది (10:1, 32; 25:12, 13; 36:1, 9).

తోలెదోత్ (*toledoth*) అను పదము ఆదికాండము యొక్క పది భాగముల యొక్క ఆరంభములో కనిపించినప్పుడు, NASB ఆంగ్ల బైబిలు అనువాదము కేవలము 2:4లో మాత్రమే "వృత్తాంతము" అని తర్జుమా చేసెను. మిగిలిన సందర్భములలో ఆ పదమును "వంశావళులు" అని తర్జుమా చేసెను. KJV ఆంగ్ల అనువాదము స్థిరముగా అన్ని సందర్భములలో "వంశావళులు" అని తర్జుమా

చేసెను; RSV ఆంగ్ల బైబిలు అనువాదము, మొదటి నాలుగు సందర్భములలో "వంశావళులు" అనియు, "సంతతివారు" అని తదుపరి అయిదు సందర్భములలోను, మరియు "చరిత్ర" అని చివరి సందర్భములోను తర్జుమా చేసెను. అయిదు భాగములలో తోలెదోత్ (*toledoth*) అను పదము తరువాత (చరిత్ర) వివరణ ఉండగా, ఇతర అయిదు భాగములలో ఒక వంశావళికి ఈ పదము శీర్షికగా కనిపించుచున్నది. ఈ పది భాగములను ఆధారము చేసికొని ఆదికాండమునకు ఒక సంక్షిప్త వర్ణన ఈ క్రింది విధముగా ఇవ్వడమైనది:

పరిచయము: భూమ్యాకాశముల సృష్టి (1:1–2:3)

*జలప్రళయమునకు ముందు ఉండిన కుటుంబముల వృత్తాంతము*

1. భూమ్యాకాశముల వర్ణన ("వృత్తాంతము") (2:4–4:26)
2. ఆదాము వంశావళి (5:1–6:8)
3. పితరుడైన నోవహు వర్ణన (6:9–9:29)
4. నోవహు కుమారుల వంశావళి (10:1–11:9)
5. షేము వంశావళి (11:10–26)

*అబ్రాహాము కుటుంబము యొక్క వృత్తాంతము*

6. పితరుడైన తెరహు యొక్క వృత్తాంతము (11:27–25:11)
7. ఇష్మాయేలు యొక్క వంశావళి (25:12–18)
8. పితరుడైన ఇస్సాకు యొక్క వర్ణన (25:19–35:29)
9. ఏశావు యొక్క వంశావళి (36:1–43)
10. పితరుడైన యాకోబు యొక్క వర్ణన (37:1–50:26)

**రచన నిర్మాణము**

నిర్మాణాత్మకముగా చూస్తే, ఈ పుస్తకమునకు రెండు ప్రధాన భాగములు ఉన్నవి: (1) మొదటి అధ్యాయము నుండి పదకొండవ అధ్యాయము వరకు మరియు (2) పన్నెండవ అధ్యాయము నుండి యాభైయావ అధ్యాయము వరకు. మొదటి భాగములో సృష్టి ఆరంభమునుండి జలప్రళయము వరకు ఉన్నది, మరియు రెండవ భాగములో అబ్రాహామునకు దేవుడు చేసిన వాగ్దానము యొక్క నెరవేర్పుగా దేవుని ప్రజల యొక్క అభివృద్ధి ఉన్నది.

*1–11 అధ్యాయములు.* ఈ మొదటి భాగము, పరిధిని బట్టి సార్వత్రికమైనది, మరియు ప్రాచీన చరిత్రను కలిగియున్నది. అనగా, ఆకాశము మరియు ఆకాశ సంబంధిత సమూహాలు, భూమి మరియు అందులోని సముద్రము మరియు

నేలపై ఉండిన సకల జాతుల జీవులు, మరియు గాలిలో ఎగురు జీవుల యొక్క సృష్టి ఈ ప్రాచీన చరిత్ర కలిగియున్నది. మానవజాతి యొక్క సృష్టి వైపుకు వివరణ త్వరితముగా వెళ్ళుచున్నది – వారు స్త్రీ పురుషులైన మానవులైయుండి, దేవుని సృష్టిలో అత్యున్నతులుగా, ఆయన స్వరూపమందు ఆయన పోలికలో చేయబడినవారు. ప్రభువు వారి ప్రతి అవసరత కొరకు సమకూర్చెను. ఒక పరిపూర్ణమైన వాతావరణములో ఆయన వారిని ఉంచెను. మరియు, వారి జీవితముల యొక్క గమ్యమును ఎంచుకొనుటకు ఆయన వారికి స్వేఛ్ఛా చిత్తమును మరియు అధికారమును అనుగ్రహించెను (1:1–2:25).

సృష్టి తరువాత ఆదాము మరియు హవ్వల ద్వారా పాపము యొక్క ఆరంభము వచ్చినది. కయీను తన సహోదరుడైన హేబెలును చంపుట ద్వారా ఈ పాపము సమస్త మానవజాతికి వ్యాపించెను. ఇందును బట్టి మానవునికి విరోధమైన పరిస్థితులతో పోరాడు పరిస్థితి వచ్చి, అంతిమముగా అతనికి అనివార్యమైన మరణమును తెచ్చినది (3:1–5:32). పాపములో మానవుడు అంతకంతకు క్రిందకి త్రోయబడుట అనునది, భూమిని ఒక తెగులువలే నింపేవరకు కొనసాగినది. అది భూమిని హింసతోను మరియు నాశనముతోనూ నింపినది; కానీ, మానవుని దుష్టత్వమునకు దేవుని శిక్షగా వచ్చిన జలప్రళయము నుండి, ఒక మనుష్యుడు మరియు అతని కుటుంబము, దేవుని కృపను బట్టి కాపాడబడ్డారు (6:1–9:29). తరువాత, మానవులు కలసి వచ్చి తమ కొరకు గొప్ప పేరు తెచ్చుకోను నిమిత్తము బాబెలు గోపురమును నిర్మించిరి. దీని శిఖరము ఆకాశమును చేరుకొనెను; కానీ, దేవుడు వారి ప్రయత్నములను విఫలము చేసి, వారి భాషలను తారుమారు చేసి, భూమి యొక్క అన్ని వైపులకు వారిని చెదరగొట్టెను (10:1–11:32).

*12–50 అధ్యాయములు.* సార్వత్రిక పాపము మరియు శిక్షలను గూర్చిన వృత్తాంతము తరువాత ఆదికాండము యొక్క రండవ ప్రధమ భాగము యొక్క దృష్టి చిన్నగా కేంద్రీకరించబడుతుంది. ఈ సందర్భములో, మానవాళి యొక్క అవిధేయతను బట్టి ప్రభువు వారిపై ప్రకటించిన శాపములను అధిగమించగలుగు వాగ్దానములను ఆయన బయలుపరచెను. ఈ పుస్తకము యొక్క అతిప్రాముఖ్యమైన విషయము ఈ అధ్యాయములలో ఉన్నది. దేవుని ప్రజల యొక్క ఆరంభము, అనగా అబ్రాము/అబ్రాహాము[8] మరియు అతని సంతతివారిని గూర్చినటువంటి పితరుల చరిత్ర ఇందులో ఉన్నది.

1. అబ్రాహాము తన స్వగృహము అయిన ఊరును (దక్షిణ మెసొపొత మియలో) విడిచి తాను అనేక ఆశీర్వాదములు పొందనైయుండిన కనాను దేశమునకు వెళ్ళమని దేవుడు అబ్రాహామును పిలిచినా పిలుపుతో ఈ భాగము మొదలవుతుంది. భూమి, గొప్ప పేరు, జనము (ఆ సమయములో అతను పిల్లలు లేనివానిగా ఉన్నప్పటికీ), మరియు భూమియందుండిన సకల వంశముల

వారు అతని ద్వారా ఆశీర్వదించబడతారు అనే సత్యము, ఈ ఆశీర్వాదములలో ఉన్నవి. అబ్రాహాము తన విశ్వాస విషయములో పోరాటము అనుభవించెను. అనేక సంవత్సరములు అతను ఒక బలహీనమైన మరియు అదే సమయములో క్రమముగా ఎదుగుచుండిన దేవునియందలి విశ్వాసముతో పోరాడుతు జీవించెను. కొంత గణనీయమైన సమయము తరువాత, అతను ఒక బలమైన విశ్వాసమును అభివృధిపరచుకొనెను, మరియు వాగ్దాన కుమారుడైన ఇస్సాకు జన్మించెను (21వ అధ్యాయము, 12–23 అధ్యాయములు చూడుము).

2. ఇస్సాకు ప్రధానముగా, అబ్రాహాము మరియు యాకోబులకు మధ్య పరివర్తనీయ వ్యక్తిగా ఉన్నాడు. ఇతని జీవితమును గూర్చిన వర్ణన ఆశ్చర్యపరచే విధముగా ఏంటో క్లుప్తముగా ఉన్నది. అబ్రాహాము హారానుకు (అతని తండ్రి యొక్క కుటుంబములో కొంతమంది ఇంకను నివసించిన చోటు) పంపించిన తన యొక్క ఒక నమ్మకమైన దాసుని ద్వారా ఇస్సాకు "రిబ్కా" అను ఒక భార్యను పొందుకొనెను. ఆమె అనేక సంవత్సరముల వరకు పిల్లలు లేకఉండెను; కానీ, ఇస్సాకు ఆమె కొరకు ప్రార్థించినప్పుడు, కవలలైన ఏశావు మరియు యాకోబుల జననము ద్వారా దేవుడు వారిని ఆశీర్వదించెను. అదనముగా, దేవుడు ఇస్సాకుతో నిబంధన వాగ్దానములను మరలా చేసెను; కానీ, ఈ వాగ్దానమును నెరవేర్చుట కొరకు దేవుని ప్రణాళిక, ఇస్సాకు యొక్క ఆశలకు విరుద్ధముగా ఉండినది. వారి సమృద్ధి కొరకైన ఆశీర్వాదములు అతనికిష్టమైన కుమారుడైన ఏశావు ద్వారా కాదు కానీ, అతని చిన్న కుమారుడైన యాకోబు ద్వారా కొనసాగనైయుండినవి (24:1–25:26).

3. తన జీవితములోని అత్యధిక భాగము న్యాయవర్తన కొరకు పోరాటము చేసిన ఒక మనిషిని, యాకోబు యొక్క చరిత్ర గాధలు తెలియజేయుచున్నవి. పన్నాగములు పన్నుటయు మరియు మోసములు చేయుటయు తన జీవన విధానముగా అతను చేసుకున్నట్లు కనిపించుచున్నది. తన ఆరంభ సంవత్సరములలో, ఏశావు ఆకలిగొనియున్నప్పడు, అతనిని తన జన్మహక్కును అమ్ముకొనుటకు ఒప్పించి, యాకోబు ఏశావును బట్టి ప్రయోజనాన్ని పొందాడు. యాకోబు తండ్రి ముసలివాడై గ్రుడ్డివానిగా ఉన్నప్పుడు, అతను తన మరణశయ్య ఆశీర్వాదమును ఏశావుకు బదులుగా యాకోబుకు ఇచ్చునట్లు యాకోబు (తన తల్లియైన రిబ్కాతో కలిసి) ఇస్సాకును మోసగించెను. అప్పుడు, తన సహోదరుని ఉగ్రతను తప్పించుకొను నిమిత్తము, యాకోబు ఉత్తర మెసొపొతమియలోని హారానుకు పారిపోయెను. ఆ దూర దేశములో యాకోబు తాను పెళ్ళాడే జంటను కలిసికొన్నాడు. ఏలయనగా, తన మామ అయిన లాబాను కూడా ఒక నైపుణ్యత గల అబద్ధికుడును మరియు వంచకుడునైయుండెను. తన కుమార్తెలైన రాహేలు మరియు లేయాలను వివాహము చేసికొను నిమిత్తము పదునాలుగు సంవత్సరములు పనిచేయునట్లుగా అతను యాకోబును మోసగించెను.

మరియొక ఆరు సంవత్సరములు పని చేసినట్లయితే విస్తారముగా పశువులు ఇస్తానని యాకోబుకు ప్రమాణము చేసినప్పుడు లాబాను మరలా అబద్ధమాడెను. అయితే, ప్రభువు యాకోబుతో ఉంది, గొప్ప మందలతో అతనిని ఆశీర్వదించెను. తన భార్యలకు అదనముగా, యాకోబు, వారిరువురి దాసీలను ఉంపుడుగత్తెలుగా పొందుకొనెను. అంతా కలిపి, ఈ నలుగురు స్త్రీలు యాకోబు కొరకు పదమూడు మంది పిల్లలను కన్నారు (పన్నెండుగురు కుమారులు మరియు ఒక కుమార్తె). ప్రభువు అతని ద్వారా నిబంధన వాగ్దానములను కూడా ధ్రువీకరించి, అంతిమముగా ఏశావుతో సమాధానపడు నిమిత్తము అతనిని తిరిగి కనానుకు నడిపించెను (25:27–35:15).

4. రాహేలు, యాకోబు యొక్క అతి ప్రియ కుమారుడైన యోసేపుకు జననమిచ్చిన తరువాత, అందరికంటే చిన్న కుమారుడైన బెన్యామీనుకు జననమిస్తూ మరణించెను. యోసేపు తన తండ్రిచే ఏంటో అల్లారుముద్దుగా పెంచబడ్డాడు. తన సహోదరులచే అతను ద్వేషించబడుటకు ఇది కారణమాయెను. ఉదాహరణకు, యోసేపు వారిని గూర్చి చెడు సమాచారము తన తండ్రి యొద్దకు తెచ్చుచుండెను. ఒకానొక దినమున వారందరు తనకు సాగిలపడుదురను కలలను వారితో పంచుకొనుట ద్వారా అతను కుటుంబమంతటికీ కోపము పుట్టించెను. అతను పదిహేడు సంవత్సరముల వయస్సు గలవాడై యుండినప్పుడు, ఐగుప్తునకు ప్రయాణమైపోవుచున్న వర్తకులకు బానిసగా యోసేపును అతని సహోదరులు అమ్మివేసిరి. ఒక క్రూరమృగము అతనిని చంపివేసెనని వారు తమ తండ్రిని నమ్మించిరి (35:16–37:35).

5. ఐగుప్తులో, యోసేపు మొదట ఫరో యొక్క దేహసంరక్షకుల అధిపతి అయిన పోతీఫరుకు బానిసగా చేసెను. యోసేపు తన యెడల అసభ్యముగా ప్రవర్తించబోయెనని పోతీఫరు భార్య అతనిపై అపనింద వేసినప్పుడు అతను చెరసాలలో వేయబడెను. అయితే, దేవుడు యోసేపు యొక్క శ్రమయంతటిలో అతనితో ఉంది, ఇద్దరు ఖైదీల యొక్క కాలాలకు అర్థము తెలియజేయగలుగు సామర్థ్యమును అతనికి కలుగజేసెను. చవరికి యోసేపు, ఐగుప్టులో ఏడు సంవత్సరముల సమృద్ధిని గూర్చియు మరియు వాటి తరువాత కలుగబోవు ఏడు సంవత్సరముల కరువును గూర్చియు ఫరోకు కలిగిన సొంత కలలకు అర్థము తెలియజేసెను. యోసేపు యొక్క దేవుడు అతనికి దీనిని ప్రత్యక్షపరచెనని ఫరో గ్రహించినప్పుడు, అతడు యోసేపును ఐగుప్తుపైని రెండవ అధిపతిగా చేసి, రానైయున్న ఏడు సంవత్సరముల కరువు కొరకు సిద్ధపడునట్లు పూర్తీ అధికారమును అతనికి అనుగ్రహించెను.

కాలము గడువగా, ఆగ్నేయ మధ్యధరా (Mediterranean) ప్రాంతములో కరువు వచ్చెను. ఐగుప్తునుండి ధాన్యము కొనుగోలు చేయుటకు యాకోబు తన కుమారులను పంపెను. యోసేపు వారిని గుర్తు పట్టెను, కానీ వారు అతనిని గుర్తు

పట్టలేదు, కనుక అతను వారిని పరీక్షించుట మొదలు పెట్టెను. మొదట, వారు వేగులవారని వారిపై అతను నిండా మోపి, వారిని చెరసాలలో వేసెను. వారు బెన్యామీనుతో కూడా తిరిగివచ్చు వరకు షిమ్యోనును మాత్రము చెరసాలలో వేసి, తక్కిన సహోదరులనందరిని తమ తండ్రి యొద్దకు వెళ్ళుటకు అనుమతించెను. వారి ధాన్యము అయిపోయినప్పుడు, వారు బెన్యామీనును తీసికొని ఐగుప్తునకు మరింగ ధాన్యము కొరకు వేల్లునట్లు యాకోబు ఒప్పుకొనెను. చివరకు, అతని సహోదరులు మార్పు చెందిరనియు, అనేక సంవత్సరముల క్రితము వారు తనకు చేసినదాని నిమిత్తము వారు పశ్చాత్తాపపడుచున్నారనియు, యోసేపు ఒప్పింపబడెను. కనుక, అతను తనను తానూ వారికి తెలియజేసికొని, వారు తనతో నివసించునట్లు, గోషెను ప్రాంతమునకు వారు తమ తండ్రిని మరియు మిగిలిన కుటుంబమంతటిని తీసికొని వచ్చుటకు, వారిని కనానుకు పంపివేసెను.

వారి తండ్రి మరణము తరువాత, యోసేపు తన సహోదరులకు ఇచ్చిన అభాయముతో ఆదికాండము ముగియుతున్నది. వారికి కీడు తలపెట్టనని వారికి వాగ్దానము చేసెను. "బహు ప్రజలను బ్రదికించునట్లు" (50:20) జరిగిన సంఘటనలన్నిటిలో ప్రభువు యొక్క కాపుదల హస్తము కార్యము చేయుచుందినదని అతను ఉద్ఘాటించెను. దేవుడు, అబ్రాహాము, ఇస్సాకు, మరియు యాకోబులతో తాను చేసిన నిబంధన యెడల నమ్మకముగా ఉ న్నాడని, యోసేపు తన మరణమునకు మునుపు తన సహోదరులకు తెలియజేసెను. ఆయన నిశ్చయముగా వారిని గూర్చి శ్రద్ధ తీసికొని ఒకనాటికి వారిని కనాను దేశమునకు తిరిగి తోడుకొనిపోవును. ఐగుప్తు వారి యొక్క శాశ్వత నివాసము కాదు కనుక, వారు వాగ్దాన దేశమునకు తిరిగి వెళ్ళునప్పుడు, తన ఎముకలను వారితో కూడా తీసికొని వెళ్ళమని యోసేపు వారికి సూచించెను. ఈ అంతిమ వాక్కులు, 12 నుండి 50కు అధ్యాయములను ఏకపరచి, జరుగనైయున్న సంఘటనల నిమిత్తము చదువరులను సిద్ధపరుస్తున్నాయి.

## ఆదికాండము మరియు చరిత్ర

ప్రాచీన సంఘటలను, వంశావళులు (1–11 అధ్యాయములు), మరి యు పితరుల వృత్తాంతములను (12–50 అధ్యాయములు) గూర్చిన ఆదికాండము యొక్క వర్ణనలో, రచయితా అందులోని వ్యక్తులను చారిత్రిక పాత్రలుగాను మరియు వారి జీవిత సంఘటనలు వాస్తవముగా కాలక్రమములో జరిగినవిగా చిత్రీకరించారు. కొందరు పితరుల యొక్క చారిత్రకతను ప్రశ్నించినప్పటికీ, ముక్కుసూటిగా లేఖనములను చదివినప్పుడు, ఆ వ్యక్తులు, వంశముల యొక్క మానవీకరణ కానీ లేక కేవలం ఫలభారితమైన ఊహా ఫలితము కానీ కారు. ప్రాచీన చరిత్రలోని మాటలు ఒక్కసారే రచించబడియున్నవి. సంపూర్ణ నిశ్చయతతో

ఖచ్చితత్వము కొరకు తనిఖీ చేయుటకు వీలుపడని విధంగా ప్రాచీన చరిత్ర ఉన్నది. ఎన్నడూ తిరిగి చోటు చేసుకొనలేనటువంటి వ్యక్తులు మరియు రాజ్యములకు సంబంధించిన సంఘటనలు అది కలిగియున్నది. కనుక – మౌఖిక లేక వ్రాయబడిన – వృత్తాంతములు నమ్మకముగా భద్రపరచబడియున్నవనే విశ్వాసపు మూలాంశము ఎప్పుడూ చరిత్ర విషయములో ఉంటుంది.

విశ్వము మరియు మానవజాతి యొక్క సృష్టిని గూర్చియు, పాపము యొక్క ఆరంభము మరియు దాని పరిణామములను గూర్చియు, మరియు ప్రభువు అబ్రహాము మరియు అతని సంతతివారి జీవితములలో ప్రారంభించిన విమోచనము యొక్క ప్రణాళికను గూర్చియు, మనము ఏమి తెలిసికొనవలెనని దేవుడు కోరుకొనేనో, వాటిని భద్రపరచుటకు పరిశుద్ధాత్మ బైబిలు రచయితలను నడిపించెనను వాస్తవమును, విశ్వాసులు లేఖనముల యొక్క ప్రేరేపణ మరియు అధికారముల క్రింద ఒప్పుకుంటారు. అయితే, ఆదికాండములో ఉన్న ఏ పితరుని గూర్చియు నిర్దిష్టముగా తెలియజేయు papyrus వివాహపత్రము కానీ, చర్మపు చుట్టాలు కానీ, మట్టి పలకలు కానీ, లేక రాతి పలకలు కానీ ఇప్పటివరకు కనుగొనబడలేదు.[9]

ఇది అంత ఆశ్చర్యపరచే విషయము కాదు. ఎందుకంటే, పురాతన కాలములలో చాలా తక్కువ సమాచారము మాత్రమే రచనలలో భద్రపరచడము జరిగినది. మనుగడ కలిగిన రచనలలో కేవలము కొన్ని మాత్రమే పురావస్తు శాస్త్రవేత్తల ద్వారా కనుగొనబడినవని అనేకులైన నిపుణులు విశ్వసిస్తారు. అంతేకాకుండా, ఆదికాండములో వివరించబడిన వ్యక్తులు పురాతన పశ్చిమాసియా ప్రాంతములోని ధనికులు మరియు ప్రసిద్ధులు కారు; కానీ, వారు, అత్యధిక భాగము, అర్ధ-దేశదిమ్మరులుగా, ఆయా ప్రాంతములలో దాదాపు ఎవరికీ కనబడకుండా అటూ ఇటూ ప్రయాణములు చేసినవారు. దీనికి కేవలము ఒకే ఒక్క మినహాయింపు, ఐగుప్తులో ఫరో తర్వాత రెండవ స్థానములోని అధికారమునకు హెచ్చింపబడిన యోసేపు. ఒకవేళ అతని పేరు రాతిపై చెక్కబడినప్పటికీ, యోసేపు ద్వేషింపబడిన హిక్సోస్ (Hyksos) రాజవంశములో భాగముగా ఉండినట్లయితే, అది మనుగడ కలిగియుండేది కాదు. వీరు ఐగుప్తీయులు కానటువంటి, సిరియా మరియు కనానుల నుండి వచ్చిన సెమిటిక్ (Semitic) పాలకులు. వీరు ఐగుప్తును దాదాపు 100 నుండి 150 సంవత్సరములు పరిపాలించిరి. వారు తరిమివేయబడినప్పుడు, వారి పేర్లు తుడిచివేయుటకును, ఐగుప్తు వాసమునకు సంబంధించిన వారి ప్రతి జ్ఞాపకమును చెరిపివేయుటకును, ఐగుప్తీయులు చేయగలిగినంతా చేసిరి.[10] అయితే, యోసేపు హిక్సోస్ (Hyksos) రాజులకు ముందే జీవించియుండ వచ్చు.

## పురావస్తు శాస్త్రము మరియు పితరుల నామములు

పితరుల యొక్క చారిత్రకతను పురావస్తు శాస్త్రము నిర్ధారించలేదు మరియు కొందరు పండితులు, పురాతన మెసొపొతమియ యొక్క సాంస్కృతిక పద్ధతులు మరియు బైబిలు వృత్తాంతముల మధ్య పోలికలు చూపుత విషయములో అతిగా ఆశక్తి చూపారు. ఆదికాండములో ఉన్న అనేక వివరములు, అందులోని రచనల యొక్క పురాతన స్వభావమును బలపరచుచున్నది. కొందరు పండితులు వాదించుచున్న విధముగా, ఆ వృత్తాంతములు, అవి జరిగిన 1000 లేక 1500 సంవత్సరముల తరువాత వచ్చిన యూదా రచయితల యొక్క సృష్టిగా ఉండుట అనునది దాదాపు అసాధ్యము కాని లభ్యమైన ఋజువులు సూచించుచున్నవి. దీనికి విరుద్ధముగా, పురాతన రచనలు బైబిలు వృత్తాంతములకు అనేక విధములుగా విశ్వాస్యతను కలిగించుచున్నవి.

మొదటిగా, “సెరూగు” (అబ్రాహాము యొక్క మూల పితరుడు), “నాహోరు” (అబ్రాహాము యొక్క సహోదరుడు), మరియు “యాకోబు” (అబ్రాహాము యొక్క మనుమడు) వంటి పితరుల కథలలోని పేరులు, క్రీ.పూ. రెండవ సహస్రాబ్దము యొక్క ఆరంభకాలములోని మెసొపొతమియ ప్రాంతములో ఉపయోగించిన పేరులతో ఖచ్చితముగా సరిపోలినది.

రెండవదిగా, తెరహు, అబ్రాహాము, మరియు నాహోరుల స్వస్థలము దుగువన యూఫ్రటీసు యొద్ద ఉన్న ఊరులో ఉండినదని, మరియు, దేవుని పిలుపునకు ముందు వారు “యితర దేవతలను పూజించిరి” అని బైబిలు వృత్తాంతము తెలియజేయుచున్నది (యెహోషువా 24:2). “లాబాను,” “శారా,” “మిల్కా,” మరియు “తెరహు,” వంటి పేరులు చంద్రుని ఆరాధనతో సంబంధము కలిగియున్నట్లు కనిపించుచున్నవి. చంద్రునికి సంబంధించిన దేవుళ్ళు మరియు దేవతలు ఆ పట్టణములోను, మరియు అబ్రాహాము యొక్క కుటుంబము తదుపరి నివసించిన హారానులోను ముఖ్యమైనవి.[11]

మూడవదిగా, “అబ్రాహాము,” “ఇస్సాకు,” “ఇష్మాయేలు,” “యాకోబు,” “యోసేపు,” “జెబూలూను,” “ఆషేరు,” “ఇశ్శాఖారు,” “బెన్యామీను,” మరియు ఇతర పేరులు, ఇదే కాలమునుండి వచ్చుచున్న, మధ్య మరియు ఎగువ యూఫ్రటీసు ప్రాంతములలని అనేక వస్తువులలో కనుగొనబడినవి. మొదటి సహస్రాబ్దము వరకు ఉన్న మూలగ్రంథములలో కూడా ఈ పేరులలో కొన్ని కనుగొనబడి నప్పటికీ, ఈ సమాచారము వాటి యొక్క పురాతన స్వభావమును ఏ మాత్రమును తగ్గించలేవు. ఏలయనగా, ఈ పేరులు వాటికంటే ముందు ఉండిన కాలమునకు చెందినా రకము. రెండవ సహస్రాబ్దము యొక్క ఆరంభ భాగములో ఈ పేరులకు ఉన్న ప్రజాదరణ మరి ఏ కాలములోను లేదు.[12]

## పురావస్తు శాస్త్రము మరియు పితరుల యొక్క సాంస్కృతిక ఆచారములు

ఆదికాండములో కుటుంబపరమైన అంశములు ఏంటో ప్రాముఖ్యమైనవి. కనుక, సాధారణముగానే, పండితులు పితరుల ఆచారములైన వివాహము, స్వాస్థ్యము, సమాధి చేయుట, మొదలగువాటిని, పురాతన మెసొపొతమియలో నివసించిన ఇతర ప్రజల యొక్క సాంస్కృతిక ఆచారములతో పోల్చి చూసిరి. అయితే, ఎవరైనా, ఈ విషయములో, అవసరమైనదానికంటే ఎక్కువ దూరము వెళ్లి, పోలికలను చేయవచు. మరియొక ప్రక్క, మూడు విషయములలో పితరుల యొక్క సాంస్కృతిక ఆచారములు, తదనంతర కాలములో కాక, క్రీ.పూ. రెండవ సహస్రాబ్ధములో ఖచ్చితముగా సరిపోతాయి.

మొదటిగా, ఆదికాండము 25:23లో జ్యేష్ఠ పుత్రుని కొరకు హెబ్రీ పదమైన רַב (*rab*) ఉపయోగించబడెను. ఇక్కడ ప్రభువు, ఏశావు మరియు యాకోబులను గూర్చి, "పెద్దవాడు చిన్నవానికి దాసుడగును," అని చెబుతాడు. ఇదే *rab* అను పదము, క్రీ.పూ. రెండవ సహస్రాబ్ధపు మధ్యకాలమునకు చెందినా అనేకమైన ప్రాచీన రచనలలో "పెద్దవాడు" అను పదమునకు ఉపయోగించబడినది; అయితే, తదుపరి కాలములో ఈ పదము యొక్క ఉపయోగము రూపులలోనికి మారిపోఎను. ఆదికాండములోని వృత్తాంతము యొక్క ప్రాచీనతకు ఇది ఒక బలమైన సంకేతము.[13]

రెండవదిగా, ఒక దాసుని వారసునిగా తీసికొనుట పితరుల కాలములోని ఆచారము. నూజీ పలకల (Nuzi tablets) ప్రకారము, కొడుకు లేని జంట ఒక కొడుకును దత్తత తీసికొనవచ్చు. తన తల్లిదండ్రులు బ్రదికియున్నంతకాలము ఇతను వారిని చూసుకొనుటకు బద్ధుడు. వారు మరణించినప్పుడు, అతను వారికి సరియైన సమాధి కార్యక్రమము జరిపించి వారి కొరకు విలాపము చేయవలసియుండెను. దీనికి ప్రతిగా, ఆ దత్తపుత్రుడు వారి ఆస్తులకు వారసుడయ్యెను.[14] దమస్కు యొక్క ఎలీయాజరు విషయములో అబ్రాహాము ఇదే జరిపింప తలపెట్టియుండెనని స్పష్టమగుచున్నది. ఏలయనగా, అతనికి మగ సంతానము లేకుండెను (15:2–4), మరియు దాదాపు ఎనబై అయిదు సంవత్సరముల వృద్ధుడైయుండెను (12:4; 16:3 చూడుము). అయితే, ఈ ఆచారము క్రీ.పూ. మొదటి సహస్రాబ్ధమునకు సరిపోయినది కాదు. ఏలయనగా, మోషే ధర్మశాస్త్రము ప్రకారము, ఇశ్రాయేలు వాగ్దాన భూమిన్ స్వతంత్రించుకున్నప్పుడు, దాని స్వాస్త్యము గోత్రములకు చెందిన కుటుంబములలోనే ఉండిపోవలసియుండెను (సంఖ్యా. 27:1–11; 36:1–12).

మూడవదిగా, పితరుల యొక్క మతపరమైన మరియు నైతికపరమైన ఆచారములు మోషే ధర్మశాస్త్రము క్రింద ఉండిన ఆచారముల యొక్క కాలము

కంటే మునుపటి కాలమును సూచించుచున్నవి; వాస్తవమునకు, తదుపరి వచ్చిన ధర్మశాస్త్రము యొక్క ఆజ్ఞలకు వ్యతిరేకముగా ఉన్నవి. ఆదికాండము 20:12లో దీని యొక్క ఉదాహరణ కనబడుతుంది, మరియు అబ్రాహాము తన సహోదరి వరసయైన శారాను వివాహం చేసుకున్నాడని అది చెబుతుంది. కాని లేవీయకాండము 18:9లో ఇది నిషేధించబడినది. దీనికి తోడు, యాకోబు ఇద్దరు సహోదరిలను వివాహం చేసుకున్నాడని ఆదికాండము 29:21–30 చెబుతుంది: లేయా మరియు రాహేలు. అయితే, ఇది కూడా లేవీయకాండము 18:18లో బలముగా నిషేధించబడింది. దీనికి ఒక వివరణ ఆదికాండము 28:10–19 "దేవుడు" యాకోబుకు స్వప్నమందు ప్రత్యక్షమై అతనిని ఆశీర్వదించెనని చెప్పుచున్నది; మరియు పితరుడు మేలుకొనినప్పుడు, అతను ఆ స్థలములో దేవుని సన్నిధికి జ్ఞాపకార్థముగ ఒక రాతి స్తంభమును అక్కడ ప్రతిష్టించెను. ఇటువంటి ఆచారములు కూడా పంచాకాండము యొక్క ధర్మశాస్త్రములో ఖచ్చితముగా ఖండించబడెను. ఏలయనగా, విగ్రహారాధన సంబంధము కలిగియుండిన కనాను యొక్క మతపరమైన క్రియలో ఇశ్రాయేలీయులు పాలుపొందే ప్రమాదము వీటి ద్వారా ఉండెను (లేవీ. 26:1; ద్వితీ. 16:21, 22). పితరుల గాధలు చారిత్రకమైనవనియు, అవి మొదటి సహస్రాబ్దమునకు పిమ్మట ఉండిన యూదా రచయితాల సృష్టి కావనియు, గమనించబడిన ఈ పై విషయములు బలముగా సూచించుచున్నవి.

## మతపరమైన బోధలు[15]

### సృష్టిలో దేవుని యొక్క ఉద్దేశములు (అధ్యాయము 1)

దేవుడు, సమస్త బైబిలునకు వలెనే, ఆదికాండమునకు ప్రధానాంశమై ఉన్నాడు. ఆయన సృష్టియొక్క సార్వభౌముడైన దేవుడు. తానూ చేయు పనుల ద్వారా ఆయన తన స్వభావమును బయలుపరచుకొనువాడైయున్నాడు. దేవుడు జీవములేనటువంటి మరియు జీవము కలిగినటువంటి సమస్తమైనవాటిని మానవునికి ఆశీర్వాదముగా ఉండుట కొరకు, సృష్టించి, సృష్టిని "మంచిది" అని మాత్రమే కాక "చాలా మంచిది" అని ప్రకటించెను (1:4, 10, 12, 18, 21, 25, 31). దేవుడు మనిషిని ఆశీర్వదించి అతనితో వ్యక్తిగత సహవాసమును కలిగియుండగలుగునట్లు, అతనిని తన పోలికయందు సృష్టించినప్పుడు, ఆయన తన మంచితనము మరియు ప్రేమఒఅను మరింతగా చూపించెను. సకల జీవులపై అధికారము కలిగియుండి వాటిని దేవుని చిత్తమునకు లోబడునట్లు చేయుట అనునది ఒక గృహనిర్వాహకుని మానవుని యొక్క కర్తవ్యమైయుండెను. కానీ, మానవుడు మొదట సార్వభౌముడైన శ్రుస్టికర్త యొక్క చిత్తములో

నడుచుకొనుటకు నేర్చుకొనవలసియుండెను.

## దేవుడు తన సృష్టి కొరకు దయచేసిన సదుపాయములు

## (అధ్యాయములు 2; 3)

దేవుడు భూమ్యాకాశాములను అందులోని సమస్తమును సృష్టించిన తరువాత విశ్రమించెను. మానవుని కొరకు ఒక పరిపూర్ణమైన వాతావరణముగా, ఆయన సకలమైన జంతువులు మరియు పక్షులతో కూడిన ఒక సుందరమైన వనమును అందించెను. ఒక లోతైన మానవ స్థాయిలో ఆమెతో వ్యక్తిగత సంబంధమును అతను కలిగియుండు నిమిత్తము, ఆయన మానవునికి సాటియైన సహాయముగా, స్త్రీని కూడా సృష్టించెను. అదనముగా, శారీరక పోషణ నిమిత్తము, ప్రతి వృక్షము అన్ని విధములైన ఫలములతో కూడ పెరుగునట్లు, దేవుడు చేసెను. ఈ వృక్షములలో జీవవృక్షము కూడా తోట మధ్యన ఉండెను. తోటను సేద్యపరచుతకును మరియు కాయుటకును దేవుడు మానవునికి సూచించెను. స్త్రీ పురుషులిరువురూ, మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్షఫలములు తినకూడదని మాత్రమే, దేవుడు చేసిన ఒకే ఒక్క నిషేధమైయుండెను. అయితే, ఆదాము మరియు హవ్వలు, దేవునివలె ఉండుటకు కోరుకొనినవారై, ఆయన చిత్తమునకు లోబడుతకు నిరాకరించుట ద్వారా, దేవునిపై మానవుని తిరుగుబాటు మరియు దేవునితో ఎడబాటుకు ఒక నమూనాను స్థాపించిరి. దీని యొక్క విషాదమైన ఫలితము ఎప్పుడూ ఒక్కటే: మరణము.

## పాపముపై దేవుని ఉగ్రత (అధ్యాయములు 4–8)

సృష్టికర్త యెడల మానవుల యొక్క కొన్ని ప్రత్యుత్తరములు, హేబెలు వలే, నిజాయితీ గల భక్తి మరియు ఆరాధనలుగా వర్ణించబడ్డాయి. తన సహోదరుని హత్య చేసి దేవుని యొక్క సన్నిధిలోనుండి పంపివేయబడిన కయీను విషయములో వలే, అంగీకరించుటకు వీలు లేనటువంటి మాటసంబంధమైన కార్యములు కూడా ఉండినవి. కయీను ఒక దేశదిమ్మరిగా దేవుని యొక్క శిక్షను భరించెను. సంస్కృతి యొక్క ఆరంభమునకు, అనగా, సంగీతము, కల, లోహముల యొక్క వినియోగము, మరియు పట్టణమును కట్టుట వంటివాటికి చెందిన ఘనత, కయీను యొక్క సంతతివారు పొందుకొనినప్పటికీ, వారిపై పాపము యొక్క శాపము ఉండెను.

కయీను నుండి వచ్చిన సంతతివారు అహంకారముగాను మరియు దేవునికే అవిధేయులుగాను ఉండుటవలన, అనేక తరముల తరువాత కూడా వారిలో పాపము యొక్క ఉనికి స్పష్టమగుచుండెను. వారు ద్వేషము మరియు ఆగ్రహములతో నిండియుండి, శత్రుత్వముతోను మరియు అన్యాయముతోను

ఉండినట్లుగా వారికి కనిపించిన లోకముపై దాడి చేసిరి. ఉదాహరణకు, వారిలో లెమెకు అను పేరుగలవాడు, ప్రతీకారముతో నిండుకొనినవాడి, కేవలము తనని గాయపరిచినందుకు ఒక పడుచువానిని చంపెను (4:23, 24).

అనేకులైన ఇతరుల జీవితములు కేవలము భౌతికసంబంధమైన ఉనికిని కలిగియుండినట్లు వివరించబడ్డాయి; అనగా, వారు జన్మించియుండి, పిల్లలను కని, స్పష్టముగా, దేవునితో సంబంధములేనివారైయుండి చనిపోయిరి (5వ అధ్యాయము). అట్టి దైవసన్నిధి లేని స్థితి, మానవజాతి యొక్క జీవితములలో అర్థము మరియు ఉద్దేశము లేని స్థితికి నడిపించెను. అందునుబట్టి, "దేవుని కుమారులు" మరియు "నరుల కుమార్తెలు" మధ్య భక్తిహీనమైన వివాహములు జరిగినవి (6:2). దీని ఫలితముగా, వారి ప్రతి ఊహ మరియు తలంపులు ఎల్లప్పుడు చెడ్డవిగా ఉంది, భూమి అంటా హింసతో నిండిపోవువరకు, మానవులు అంతకంతకు క్రిందికి దిగజారిపోతూ ఉండిరి (6:5). దీని పర్యవసానముగా, మానవుడు తనను తానూ మరియు తన ప్రపంచమును నాశనము చేసికొనే ప్రక్రియలో ఉండగా, దేవుడు దానిని తన ఉగ్రత యొక్క అంతిమ ప్రత్యక్షతతో నాశనము చేసి ముగించుటకు నిర్ణయించుకొని, మానవాళిని నశింపజేయుటకు భూమిపైకి జలప్రళయమును పంపెను (అధ్యాయములు 6–8).

## దేవుని తీర్పు మరియు తన ప్రపంచమును ఆయన పునర్నవీకరణ (అధ్యాయములు 9–11)

దేవుని కృపను బట్టి, నోవాహు మరియు అతని కుటుంబము జలప్రళయము నుండి బయటపడ్డారు. అప్పటినుండి భూమిపైన ఉన్న మనుష్యులందరు వారి సంతతివారే. ఈ వాస్తవము యొక్క వెలుగులో, జాతి వివక్ష చూపుటకు ప్రజలకు ఎలాంటి బైబిలుపరమైన ఆధారము లేదు. ఏలయనగా, మనుష్యులలో ఏ జాతీయు ఇతర జాతులకంటే తక్కువైనది కాదు. పైగా, జలప్రళయమునకు ముందు కాలములోని సమస్త దుష్టత్వము మరియు హింసల నుండి శుద్ధముగా కడుగబడిన ప్రపంచములో దేవుడు మానవునికి ఒక నూతనమైన ఆరంభమునిచ్చెను. దేవుడు ఆరంభ సృష్టి క్రమమును తిరిగి నిర్ధారించెను: సంవత్సరమంతటిలో క్రమముగా కాలమును కొనసాగుతాయి, అల్లాగే, పగలు మరియు రాత్రులు కూడ కొనసాగుతాయి. అదనముగా, సృష్ట్యారంభము యొక్క అసలైన ఆశీర్వాదముతో దేవుడు నోవాహును మరియు అతని కుమారులను ఆశీర్వదించెను: "మీరు ఫలించి అభివృద్ధి పొంది భూమిని నింపుడి" (9:1; 1:28 చూడుము). మరియు, భూమిని నాశనము చేయుటకు సమస్త భూమిపైకి జలప్రలయము మరెన్నటికి పంపించనని ఆయన వాగ్దానము చేశాడు.

జలప్రళయము పాత లోకమును మరియు దానికి అడ్డం పట్టిన పాపులను

నాశనము చేసినప్పటికీ, దానిని తప్పించుకొనినవారు పాపమార్గములో కొనసాగిరి. నోవాహు ద్రాక్షతోటను నాటించి, అతిగా మద్యము సేవించి, వస్త్రరహితముగా తన గుడారములో ఉండెను. హాము తన తండ్రి యొక్క నగ్నత్వమును గూర్చి తన సహోదరులకి తెలియజేసెను (బహుశ, ఒక హేళనకరమైన రీతిలో అయి ఉండవచ్చు). ఈ విధముగా చేసి అతను తండ్రి యెడల అగౌరవమును చూపి, తన కుమారుడైన కనాను ద్వారా తన సంతతివారిపై శాపమును తెచ్చెను. బాబెలు యొక్క మనుష్యులు, వారి కొరకు పేరు తెచ్చుకొనుటకు ప్రయత్నించుటలో అహంభావులై (బహుశ, విగ్రహారాధికులుగా కూడా) ఉన్నారు. దాని శిఖరము ఆకాశమునంటు విధముగా రూపొందించబడిన ఒక గోపురమును వారు నిర్మించిరి. వారు భాషలను తారుమారు చేసి వారిని భూమి యొక్క అన్ని దిక్కులకు చెదురగొట్టుట ద్వారా, బాబెలు మనుష్యుల యొక్క కార్యమును దేవుడు నిరర్థకము చేసెను. దేవుని వలే ఉండుటకు మానవుడు చేసిన అన్ని ప్రయత్నములు – స్వతంత్రత, స్వయంపాలన, మరియు స్వయంతృప్తి – ఇవన్నీ కూడా మరింత పాపము, కలహము, నిరాశ, మరియు దేవుని నుండియు మరియు మనుష్యుని నుండియు యెడబాటునకును నడిపించాయి.

## విశ్వాసపు నడక కొరకు దేవుని పిలుపు (అధ్యాయములు 12–22)

విశ్వాసముతో మొదలవ్వవలసిన, దేవునితో వ్యక్తిగత సంబంధములో మాత్రమే, అర్థవంతమైన జీవితమూ మరియు ఉద్దేశపూర్వకమైన గమ్యము కొరకైన మానవుని ఏకైక నిరీక్షణ ఉన్నది. దేవుడు చొరవ తీసికొని, తన కుటుంబముతోపాటు విగ్రహారాధికుడిగా ఉండిన అబ్రాహామును (యెహోషువా 24:2) ఒక విశ్వాసపు నడకను ప్రారంభించుట కొరకు పిలిచెను. సంవత్సరములు గడుచుచుండగా, అబ్రాహాము యొక్క విశ్వాసము సన్నగిల్లుతూ మరియు బలపడుతూ ఉండినది. తన పరిపూర్ణ విధేయతను బట్టి లేక ఏదైనా తన సొంత అర్హతనుబట్టి కాక, దేవుడు తన కృపను బట్టి విశ్వాసము ద్వారా అతనిని నీతిమంతునిగా ఎంచినందుకే, దేవుడు తనని అంగీకరించెనని అతను నేర్చుకొనెను (15:6).

దేవుడు అబ్రాహామును కేవలము అతని నిమిత్తము మాత్రమే రక్షించలేదు కానీ, అతనిని ఒక మధ్యవర్తిగా చేసి, అతని ద్వారా ఒక గొప్ప జనాంగమునకు, అనేకులైన ప్రజలకు, మరియు అంతిమముగా భూమిపైనున్న సమస్త ప్రజలకు ఆశీర్వాదపు మాధ్యమముగా ఉండుట కొరకు రక్షించెను. కనుక, రక్షణ ప్రాథమికముగా, అబ్రాహామును గూర్చినది కాదు. దానికి బదులుగా, రక్షణ అనునది, ప్రభువు తన కృపను బట్టి ఈ ఒక్క మనుష్యుని కొరకు మాత్రమే కాక, అతని ద్వారా సర్వలోకమునకు ఏమి చేయగలిగాడో అను దానిని గూర్చి అయి ఉన్నది. అబ్రాహాము తన ఇంటిని మరియు కుటుంబమును విడిచిపెట్టి తను

ఎన్నడూ చూడని ఒక దేశమునకు వెళ్ళుటకు దేవుని ద్వారా పిలువబడినప్పుడు, అతను తన జీవితమంతా కొనసాగించిన ఒక విశ్వాసపు నడకను ప్రారంభించెను (హెబ్రీ. 11:8). ఈ విశ్వాసులకు తండ్రి అయినవాని జీవితమును పరిశీలిస్తే, ఒక వ్యక్తి యొక్క విశ్వాసము యొక్క చెల్లుబాటుతనమునకు అత్యున్నత పరీక్ష, దేవుడు తన కొరకు ఏమి చేయగలడని ఒక మనుష్యుడు నమ్ముతున్నాడో అనునది కాదు. దానికి బదులుగా, దేవుని కొరకు ఏమి చేయుటకు ఇష్టపడుతున్నాడో మరియు ఆయనకి ఏమి ఇవ్వవలెనని ఉన్నాడో అనునదే అత్యున్నత పరీక్ష. అబ్రాహాము విషయములో, అది తన వాగ్దాన పుత్రుడే (అధ్యాయము 22).

## అబ్రాహాము యొక్క విశ్వాస ఫలితములు (అధ్యాయములు 23; 24)

అబ్రాహాము శారాను పూడ్చిపెట్టినప్పుడు, అతను కానానీయుల మధ్యలో అరవై సంవత్సరములకంటే ఎక్కువ కాలము జీవించియుండె ను.[16] దేవుడు అతనిని ఆశీర్వదించి, అతనిని ధనికునిగాను మరియు శక్తివంతునిగాను, ఒక "మహారాజు" (అక్షరాలా "దేవుని యొక్క యువరాజు"; 23:6) వలే చేసెననియు వారు గ్రహించిరి. కనానీయుల ఎదుట నీతిగల జీవితమును జీవిచి, అత్యధిక భాగము అబ్రాహాము తన వెలుగును ప్రకాశింపనిచ్చెను (మత్తయి 5:16). అదనముగా, ఆ దేశములో అతనికే అతిపెద్దదైన వ్యక్తిగత సైన్యము ఉండియుండవచ్చు.[17] ఇందునుబట్టే ఇతరులు అతనికి భయపడుచు గౌరవము ఇచ్చియుండవచ్చు.

ఇస్సాకుకు పెండ్లి చేసికొనే సమయము వచ్చినప్పుడు, అతనికి భార్యను వెదకుట కొరకు అబ్రాహాము తన నమ్మకమైన దాసుకి మెసొపొతమియలోని తన బంధువుల యొద్దకు పంపెను. ఆ స్త్రీ తనతో పాటు కనానుకు తిరిగి వచ్చుటకు ఇష్టపడకపోవచ్చుననే విషయమును ఆ దాసుడు తానూ వెళ్లకముందు ప్రస్తావించెను. ఒకవేళ అది జరిగితే, ఇస్సాకును తానూ మెసొపొతమియకు తీసికొనివచ్చునెమో అని అతను అబ్రాహామును అడిగెను. ఇస్సాకును ఆక్కడికి తీసికొని వెళ్ళుటకు అతని యజమానుడు అతనిని నిషేధించెను. ఒకవేళ తన కుమారుడు వెళ్ళిపోయి కనానుకు తిరిగి రాకపోతే దేవుని వాగ్దానము యొక్క నెరవేర్పు అపాయములో పడుతుందని అబ్రాహాము గ్రహించెను. దేవుని ప్రజలకు, దేవుడు వారిని ఎక్కడ జీవించుటకు పిలిచెనో, ఆ ప్రాంతమునుండి తిరిగి వెళ్ళుట అనేది ఉండకూడదు అని అబ్రాహాము గ్రహించెను.

తన యజమానుని కుమారుని కొరకు హారానులో ఏ ఆడపిల్ల సరియైనదో తెలిసికొనుటకు వెదికే ప్రక్రియలో, అబ్రాహాము యొక్క దాసుడు ప్రార్థన యొక్క శక్తిపైఇనను మరియు దైవికమైన నడిపింపు పైనను విశ్వాసమును ప్రదర్శించెను. అబ్రాహాము సహోదరుడైన నాహోరు యొక్క కుటుంబములోనుండి రిబ్కాను

ఎన్నుకొనుటకు దేవుడు అతనిని నడిపించెను. అప్పుడు ఆ దాసుడు ఆమెని ఇస్సాకుకు భార్యగా కనానుకు తీసికొనివచ్చెను (అధ్యాయము 24).

ఇదంతా కూడా అబ్రాహాము యొక్క వ్యక్తిత్వము మరియు సమర్పణలను గూర్చి దేవుడు చేసిన ప్రకటన వాస్తవమైనదని తెలియజేస్తుంది: "ఎట్లనగా యెహోవా అబ్రాహామును గూర్చి చెప్పినది అతనికి కలుగుజేయునట్లు తన తరువాత తన పిల్లలును తన యింటివారును నీతి న్యాయములు జరిగించుచు, యెహోవా మార్గమును గైకొనుతకు అతడు వారికాజ్ఞాపించునట్లు నేనతిని నెరిగియున్నాననెను" (18:19). అబ్రాహాము విశ్వాసము ఎంత నిజమిందంటే, అతను దానిని తన తరువాత తన పిల్లలకు మాత్రమే కాక, "తన యింటివారికి," అనగా, తన దాసులకు కూడా ఇచ్చెను. వారు "యెహోవా మార్గము గైకొనునట్లు" అతను ఈలాగున చేసెను.

## మానవ భవితవ్యమును (Destiny)

## గూర్చి దేవుని భవిష్యత్ జ్ఞానము (Foreknowledge)

## (అధ్యాయములు 25–28)

యాకోబు మరియు ఏశావుల మధ్య పోరాటము వారు జన్మించకముందే ఆరంభమైనది (25:22, 24–26), మరియు దాని యొక్క ప్రాముఖ్యతను గూర్చి దేవుడు రిబ్కాకు ప్రకటించెను. "రెండు జనములు నీ గర్భములో కలవు. రెండు జానపదములు నీ కడుపులోనుండి ప్రత్యేకముగా వచ్చును. ఒక జనపదముకంటె ఒక జనపదము బలిష్టమై యుండెను. పెద్దవాడు చిన్నవానికి దాసుడగును" (25:23). ఈ వాక్యభాగము తరచూగా వివరించబడిన ఒక విధానము ఉన్నప్పటికీ, యాకోబు లేక ఏశావుల నిత్య గమ్యముతో దీనికి ఎటువంటి సంబంధము లేదు. ఈ ప్రవచనము ఇరువురి బిడ్డలలో ఏ ఒక్కరిని గూర్చినది కాదు. ఏలయనగా, ఏశావు ఎన్నడూ యాకోబుకు సేవ చేయలేదు: దానికి బదులుగా, వారి సంతతివారు ("రెండు జనపదములు") విమోచన యొక్క చరిత్రలో కలిగియుండు పాత్రలను గూర్చి ఈ ప్రవచనము సూచిస్తుంది. యాకోబు నుండి వచ్చిన సంతతివారు ఇశ్రాయేలీయులు కాగా, ఏశావు నుండి వచ్చినవారు ఎదోమీయులు. ఏదోమీయులు దావీదు యొక్క కాలములో లోపరుచుకొనబడి అతని పాలనలో దాస్యము చేయుటకు బలవంతము చేయబడిరి (2 సమూ. 8:14). ఈ లోకమునకు క్రీస్తు యొక్క రాకడ వైపునకు చరిత్ర కొనసాగుచుండగా, పాతనిబంధన కాలమంతటిలో ఈ "రెండు జనపదములు" మధ్య నిరంతర కలహముల వైపునకు ఇది క్రమముగా నడిపించెను.

వారు ఆ ప్రవచనము యొక్క సంపూర్ణ భావమును అర్థము చేసికొనిరా లేదా అనేదానితో నిమిత్తము లేకుండా, ప్రభువు యాకోబు మరియు ఏశావుల

జన్మమునకు ముందే వారి జీవితములను గూర్చి ముందుగా ఎదురుచూచిన విధముగా వారిరువురు తమ జీవితము కొరకైన దేవుని ఉద్దేశము మరియు నిర్వహణలో తమ మార్గములను కనుగొనుటకు ప్రయాసపడిరి. అబ్బాయిలిరువురు మరియు వారి తల్లిదండ్రులు దేవుని చిత్తమును తమ నియంత్రణలోనికి తెచ్చుకొనుటకు లేక దానిని వ్యతిరేకించుటకు ప్రయత్నమూ చేసిరి. ఈ వ్యవహారముతో సంబంధము కలిగియున్నవారందరిని కుటుంబ సంబంధములలో హృదయము పగిలిపోవునటువంటి ఫలితములు దీని వలన కలిగెను. కనుక, యాకోబు యొక్క వ్యక్తిత్వ లోపములు మరియు అతను ఎదుర్కొన్న సమస్త కష్టములు తమియు ప్రమాదములు ఉన్నప్పటికీ, దేవుడు నిజముగా తనతో ఉండి తన ద్వారా ఆయన వాగ్దానములను నెరవేరుస్తాడని విశ్వసించు నిమిత్తము, యాకోబు యొక్క జీవితములోని అత్యధిక భాగము న్యాయవర్తన మరియు విశ్వాసముల కొరకైన పోరాటముగా ఉండెను.

మరియొక వైపు ఏశావు, తన జీవితములో దేవుని నడిపిమ్పును వ్యతిరేకించెను. తన తల్లిదండ్రులు గొప్ప లోకమునకు కారకులైన కనాను భార్యలను అతను ఎన్నుకొనెను (26:34, 35; 27:46; 28:8). యాకోబు తన మరణశయ్య ఆశీర్వాదమును దొంగిలించినందుకు, అతనికి వ్యతిరేకముగా పగ పెట్టుకొని అతనిని చంపవలెననే ఆలోచనతో, అతను కొంతకాలము తనను తానూ ఓదార్చుకొనెను (27:41). ఏశావు తన పరిస్థితి నిమిత్తము దేవునిని నిందించియుండవచ్చు. ఏలయనగా, లేఖనములు బయలుపరచినంతవరకు, అతను తన జీవితమును ఎటువంటి విశ్వాసము లేకుండా జీవించెను. వాస్తవమునకు, హెబ్రీయులకు వ్రాయబడిన పత్రిక యొక్క రచయిత అతనిని “వ్యభిచారి” మరియు “భ్రష్టుడు” (భక్తిహీనుడు) అని పిలిచెను (హెబ్రీ. 12:16). జీవించుటకు మెరుగైన మార్గము ఉండియుండవలెనని ఇదంతా సూచిస్తుంది: దేవుని చిత్తమును తెలిసికొనగలుగునంతవరకు, దానిని అంగీకరించు మార్గము మరియు విధేయతతో దానికి ప్రతిస్పందించుట. దేవుని చిత్తమునకు వ్యతిరేకముగా ద్వేషపూరితమైన పోరాటములో తమ జీవితములను గడిపివేయు ఏశావువంటివారు, వారు అనుభవించు శ్రమలు మరియు నిరాశలలో అత్యధిక భాగము నిమిత్తము తమమును తామే నిందించుకొనవలసినవారై యున్నారు. నిత్యమైన కుమ్మరికి తమమును తాము అప్పగించుకొనుటకు నిరాకరించుట వలన, తమ జీవితములలోనుండి ఉపయోగపడే మరియు సుందరమైన దానిని చేయవలెననే దేవుని ప్రణాళికను వారు పాడు చేస్తారు (యిర్మియా 18:1–12; 2 తిమోతి 2:20–22 చూడుము).

## బహుభార్యాత్వము యొక్క ప్రతికూల ఫలితముల యొక్క బయల్పాటు (అధ్యాయములు 29; 30)

వివాహమును ఒక్క పురుషుడు మరియుఒ ఒక్క స్త్రీ మధ్య ఏకపత్నీవ్రత్య సంబంధముగా సృష్టించుటలో దేవుని జ్ఞానము ఉంది. అయితే, యాకోబు యొక్క ఇద్దరు భార్యలైన రాహేలు మరియు లేయాల మధ్య ఉండిన ద్వేషము, ఈర్ష్య, మరియు ఒత్తిడులకు వ్యతిరేకముగా ఈ దేవుని జ్ఞానము కనబడుచున్నది. ఎవరైతే ఎక్కువమంది పిల్లలను కంటారో వారే తన భర్తకి అత్యంత ఇష్టమైన భార్యగా ఉంటుందని ఇద్దరు స్త్రీలు అనుకొనిరి; కనుక, సమయముగడువగా, ఈ ఇద్దరు స్త్రీలు కూడా, ఎక్కువ మంది పిల్లలు తమ పిల్లలుగా లెక్కింపబడునట్లు, తమ దాసీలను యాకోబుకు ఇచ్చిరి. ఈ పితరుని యొక్క భార్యల మధ్య ఉండిన శత్రుత్వము ఇతని పిల్లల జీవితములలో నాశనకరమైన పరిణామములను తెచ్చినది. తనకు అత్యంత ప్రియ కుమారుడైన యోసేపు చనిపోయెనని ఇతను అనుకున్నప్పుడు, యాకోబుకు సహితము అనేక సంవత్సరముల వరకు హృదయవేదన కలిగియుండుటకు ఇది నడిపించెను.

## దేవునికి యెడతెగక ప్రార్థన చేయుటలోని విలువ (అధ్యాయములు 28; 32)

28:20—22లో యాకోబు చేసిన ప్రార్థన నిజానికి అతను దేవునితో చేసిన ఒక "ఒకవేళ ... అప్పుడు" బేరము అయి ఉన్నది. మనుష్యుడు దేవుని కొరకు ఏమైనను చేసినందుకు ప్రతిగా మానవుని పక్షముగా దేవుడు పనిచేయుటకు, దేవునిని బద్ధునిగా చేయుట ద్వారా, దైవిక ఆశీర్వాదములు పొందుకొనబడవు. ఒక ప్రభువు యొక్క దూతతో కుస్తీ పోటీలో శారీరక పరాక్రమము లేక చిత్తము యొక్క శక్తి ప్రదర్శించుట ద్వారా కూడా దేవుని ఆశీర్వాదములను ఒక వ్యక్తి పొందుకొనలేడు! తమ వైపునకు వచ్చుచున్న ఏశావు యొక్క నాలుగువందల సాయుధులైన పురుషుల నుండి తనను తాను మరియు తన కుటుంబమును రక్షించుకొనలేడని గ్రహించినప్పుడు మాత్రమే యాకోబు నిజమైన విడుదలను అనుభవించెను (33:1 చూడుము). ఎంతటి కపటోపాయములైనను, అబద్ధములాడుటయైనను, లేక పన్నాగములు పన్నుటయైనను, యాకోబునకు అక్కరకు రావు. 32:22—32లో (దేవునికి ప్రతినిధిగా ఉండిన) దేవదూతతో చేసినట్లు దేవునిని గట్టిగా పట్టుకొని ఆయన ఆశీర్వాదము కొరకు వేడుకొనుటయే తన ఏకైక నిరీక్షణయై ఉన్నది.

కనుక, విశ్వాసము ద్వారా ఎడతెగని వేడుకోలు చేయుటయే జవాబులు వచ్చు ప్రార్థనలకు కీలకము; మరియు ఇది, దేవుడు తన పక్షముగా కార్యము చేయుట కొరకు మానవుడు విపరీతమైన కృషి చేయవలసియుండుటను బట్టి మాత్రము కాదు. అయితే, ఆశీర్వాదమునకు నిజమైన మూలము దేవుడే అను

వాస్తవమును ఎడతెగని ప్రార్థన ఒప్పుకొనును; మరియు మానవుడు, విరిగిపోయి, సహాయము కొరకైన తన తీవ్రమైన అవసరతను ఒప్పుకొనుచున్నప్పుడు, ప్రభువు ఇచ్చునటువంటి తన మంచితనము మరియు కనికరములయందు విశ్వాసము చూపుచున్నాడు.

## దేవుని దైవకృతమైన (Providential) కార్యము (అధ్యాయములు 37–50)

దేవుడు, ప్రజలు మరియు దేశముల యొక్క జీవితములలో, తన ఉద్దేషములు నెరవేర్చుటకొరకు ఏ విధముగా తెర వెనుక ఉండి, మానవుల స్వేచ్ఛా చిత్తమును ఉల్లంఘించకుండా కార్యము జరిగిస్తాడో, యోసేపు యొక్క గాథ తెలియపరుస్తుంది. ప్రజలు దైవికమైన చదరంగములో పావులు కారు. దేవుని చేత మొదట ఒక దిక్కునకు పిమ్మట మరియొక దిక్కునకు వారు నెట్టబడుటలేదు. దీనికి వ్యతిరేకముగా, దేవుడు ప్రజలు చేసే మంచి మరియు చెడు విషయములను తీసికొని, తన అంతిమ ఉద్దేశాములను నెరవేర్చుకొనునట్లు వాటిని చేస్తాడు (రోమా. 8:28). అబ్రాహాము యొక్క సంతానముగా, యాకోబు యొక్క వంశమునకు, ఐగుప్తుకు, మరియు ప్రాచీన మధ్యధరా (Mediterranean) ప్రపంచములోని ప్రజలకు ఆశీర్వాదకారకుడు అవ్వాలని యోసేపు విషయములో దేవుని చిత్తము.

కొన్నిసార్లు దీర్ఘమైన మరియు కష్టతరమైన సంఘటనలు కలిగియుండినప్పటికీ, దేవుడు తన ప్రణాళికలను నెరవేర్చుట కొరకు మనుష్యుల యొక్క అహంకారపూరితమైన, స్వార్థపూరితమైన, మరియు దుష్ట క్రియలను – ఐగుప్తు దాస్యమునకు ఒక సహోదరుని అమ్మివే యుటవంటివి – వినియోగించుకొనగలడని, యోసేపు యొక్క వృత్తాంతము విషాదముగాను మరియు స్పష్టతతోను వివరించుచున్నది. ఆశించిన విధముగానే, ఎవరైతే ఆయన చిత్తమును నిరంతరము వెదుకుతారో వారిని దేవుడు అందరికంటే బాగా వాడుకొనగలడు; అయితే, అయినప్పటికీ, వారి జీవితములలో ఆయన హస్తము స్పష్టపరచబడకపోవచ్చు. ఒకరు గతమును నిశితముగా పరిశీలించినప్పుడే దేవుని యొక్క దైవకృతమైన పరామరిక (providential care) అత్యంత స్పష్టముగా అర్థమవుతుంది (45:5–7; 50:20).

## దైవికమైన వ్యక్తిత్వము రూపుదిద్దుకొనుటలో నైతిక విలువల యొక్క స్థానము (అధ్యాయము 39)

యోసేపు ఐగుప్తులో ఒక దాసునిగా ఉండెను. పోతీఫరు భార్య అతనిని మరులుగొలుపుటకు తరచుగా ప్రయత్నమూ చేసినప్పుడు, అతని నిరాకరణకు రెండు రకములైన ఆధారములు కలవు. ఈ కారణమును బట్టి అతను, “నీ భర్త

నిన్ను తప్ప సమస్తమును నాకు అప్పగించెను; కనుక, అతని సొత్తులలో దేని నిమిత్తము అతను చింతించనవసరము లేదు" అని అనెను. మరియొక మాటలో, "పోతీఫరు నన్ను విశ్వసిస్తున్నాడు, మరియు అతని భార్యతో లైంగికపరముగా సన్నిహితము అవుత అనునది అతని నమ్మకమును తీవ్రముగా మోసగించుటయే." మరొకని భార్యతో వ్యభిచారము చేయుట దేవునికి వ్యతిరేకముగా పాపము చేయుటఏ అవుతుందని కూడా అతను చెప్పెను.

యోసేపు ఇంత బలమైన బ్యాయవర్తన మరియు నైతిక విలువలను గూర్చిన భాగమును పై ఏ విధముగా అభివృద్ధిపరచుకొనెనో అనే విషయము దేవళము ఊహించుకొనగలిగిన విషయము మాత్రమే. బహుశా, అతని తల్లిదండ్రులైన యాకోబు మరియు రాహేలు, అతనితో, అబద్ధములు చెప్పుట మరియు మోసము చేయుట వలన వారికి కలిగిన కష్టములను గూర్చి చెప్పియుండవచ్చు, మరియు దేవుడు తన ప్రజలనుండి కోరుకొనుచున్న లైంగిక విషయములలోని నైతిక నడతను గూర్చి కూడా చెప్పియుండవచ్చు. వ్యభిచారము అనేది కేవలము సులభముగా హేతుబద్ధము చేయగలిగినటువంటి ఒక సాంఘీక అజాగ్రత్త కాదు; అటువంటి క్రియలను గూర్చి ఎల్లప్పుడు తెలిసికొనుచున్న దేవుని స్వభావమునే ఉల్లంఘించునటువంటి ఒక తీవ్రమైన పాపమది.

## దేవుని క్షమాపణ మరియు సమాధానపరచబడుట (Reconciliation)

## (అధ్యాయములు 42–45)

పైపైన చూస్తే, యోసేపు తన సహోదరుల యెడల కఠినముగా వ్యవహరించుట మరియు కనపరచిన ఉపాయమును చూస్తుంటే సంవత్సరముల కొలదీ యోసేపు ఐగుప్తులో అనుభవించిన హృదయవేదన మరియు శ్రమల కొరకు అతను తన సహోదరుల చేత వెల చెల్లింపచేసే ఒక కక్ష తీర్చుకొనే ప్రయత్నముగా కనిపిస్తుంది. అయితే, ఇది వారి కౌమార దశలో వారిని అతను గుర్తుపెట్టుకొన్న విధముగానే కాలము గడిచిన పిమ్మట వారు అలా ఉన్నారేమో కనుగొను నిమిత్తము పెట్టిన పరీక్ష అయి ఉండవచ్చు. వారి తమ్ముడికి వారు చేసినదానికి వారు పశ్చాత్తాపపడుచున్నారా? సమాధానపడుట సాధ్యమేనా? వారు మరలా ఎప్పటికైనా ఒక కుటుంబముగా ఉండగలరా?

వాస్తవముగానే, అన్నలు వారి పశ్చాత్తాపములో యధార్థత కలిగియుండినట్లయితేనే నిజమైన సమాధానము కలుగుతుంది. ఒకటికంటె ఎక్కువ సార్లు, ఐగుప్తులో ఈ సహోదరులు అనుభవించిన కష్టములు వారు యోసేపు యెడల జరిగించిన దానికి ప్రతిగా దేవుడు వారిని న్యాయముగా శిక్షించుచున్నాడని విశ్వసించుటకు కారణమాయెను. అంతిమముగా, యోసేపు తన సహోదరులకు తనను తాను తెలియపరుచుకొని తన క్షమాపణను గూర్చిన

నిశ్చయతను వారికి ఇచ్చినప్పుడు, అది కేవలము వారి కొరకు తనకి ఉన్న ప్రేమపై ఆధారపడిలేదు. కానీ, దేవుని ఉద్దేశములు వారి జీవితములలో నెరవేరుచున్నవనే గ్రహింపుపై ఆధారపడెనని ఉద్ఘాటించెను.

### భవిష్యత్తు కొరకు తాళముగా నిరీక్షణ (అధ్యాయములు 49; 50)

యాకోబు తన కుమారులపై ప్రకటించిన ఆశీర్వాదములు, మొదట వ్యక్తులుగా వారికి సంబంధించినవి; కానీ, ఇంకా గొప్ప భావములో, అతని మాటలు వారిని దాటుకొని, తమ సంతతివారైన కనానులోని పన్నెండు గోత్రముల యొక్క భవిష్యత్తును సూచిస్తున్నాయి. అబ్రాహామునకు దేవుడు చేసిన వాగ్దానములను కలిగి కొనసాగించువారు కాబట్టి దేవుడు వారికి, వారి పిల్లలకు, మరియు సర్వ ప్రపంచమునకు ఇచ్చిన ఉన్నత మరియు పరిశుద్ధ పిలుపును వారు ఎన్నడు మరువకూడదు (12:1–3). ప్రతి వారము తమ పిల్లలకు వారు ఎవరో, ఎవరివారో, మరియు ఎందుకు ఉన్నారో (ఏ ఉద్దేశము కొరకు) బోధించవలెను. వాగ్దానములు మరియుఉ నెరవేర్చుటకు బాధ్యతలు కలిగియుండి వాటిని నిర్లక్ష్యము చేయనివారికే భవిష్యత్తు చెందుతుంది.

అప్పటికే, ఇశ్రాయేలీయుల యొక్క భవిష్యత్తు నిరీక్షణ, యూదా గోత్రము నుండి వచ్చు ఒక పరిపాలకునిపై కేంద్రీకృతమయ్యాయని యాకోబు యొక్క ఆశీర్వాదములలో స్పష్టమగుచున్నది. ఈ పరిపాలకునికి జనములు (అన్యజనులు) విధేయులైయుంటారు (49:10). దేవుడు అబ్రాహామునకు చేసిన వాగ్దానములను యోసేపు తన సహోదరులకు జ్ఞాపకము చేయుటతో మరియు ఐగుప్తు వారి శాశ్వత నివాసము కాదు గనుక వారు ఐగుప్తును విడిచి వెళ్ళునప్పుడు తన ఎముకలను వారితో తీసికొనివెళ్ళవలెననే యోసేపు ఆజ్ఞతో ఈ పుస్తకము ముగియుచున్నది. వారు వాగ్దాన భూమిలో నెరవేర్చుటకు ఒక గమ్యమును కలిగిన ప్రజలైయుండిరి (50:24, 25).

## సంక్షిప్త వర్ణన

ఒక విధానము ఈ పుస్తకము యొక్క ప్రధాన భాగములను లెక్కలోకి తీసుకుంటుంది. పురాతన చరిత్ర యొక్క సంఘటనలకు మొదటి భాగము ప్రాధాన్యత నిస్తుండగా, రెండవ భాగము పితరుల యొక్క కథనములను బట్టి పొందుపరచబడినది: అబ్రాహాము, ఇస్సాకు, యాకోబు, మరియు యోసేపు.

*భాగము 1*

I. లోకము యొక్క ప్రాచీన చరిత్ర (1:1–11:32)
   A. సృష్టి యొక్క ఆరంభము మరియు సంపూర్తి (1:1–2:3)

B. తోటలో ఉన్న మానవుడు మరియు స్త్రీ యొక్క సృష్టి (2:4–25)
C. మానవుని పతనము (3:1–24)
D. తోట వెలుపట ఆదాము మరియు హవ్వల కుటుంబము (4:1–16)
E. రెండు వంశావళులు (4:17–26)
F. జలప్రళయమునకు ముందు ఉండిన పితరులు (5:1–32)
G. జలప్రళయము: నాశనము మరియు సంరక్షణ (6:1–22)
H. జలప్రళయము యొక్క రాకడ (7:1–24)
I. మానవజాతి కొరకు నూతన ఆరంభము (8:1–22)
J. నూతన లోకము కొరకు దేవుని యొక్క ఆజ్ఞలు మరియు నిబంధన (9:1–29)
K. నోవాహు సంతతివారు (10:1–32)
L. జాతుల యొక్క విస్తరణ: భాషల తారుమారు మరియు వంశావళులు (11:1–32)

*భాగము 2*

II. అబ్రాహాము యొక్క వృత్తాంతము (12:1–25:18)
A. కనాను అను నూతన ప్రదేశమునకు వెళ్లుటకు అబ్రాహామునకు పిలుపు (12:1–20)
B. అబ్రాహాము మరియు లోతు విడిపోవుట మరియు వాగ్దానములను మరలా చేయుట (13:1–18)
C. యుద్ధములో అబ్రాహాము పాలుపొందుట మరియు ఇద్దరు రాజులను కలుసుకొనుట (14:1–24)
D. అబ్రాహాముతో దేవుడు భూమిని గూర్చి చేసిన నిబంధన (15:1–21)
E. హాగరు మరియు ఇష్మాయేలుల కథ (16:1–16)
F. అబ్రాహాముతో దేవుడు జాతిని గూర్చి చేసిన నిబంధన (17:1–27)
G. అబ్రాహామును దేవుడు దర్శించుట (18:1–33)
H. సొదమ మరియు గొమొఱ్ఱాల నాశనము (19:1–38)
I. గెరారులో అబ్రాహాము మరియు శారా: దేవుని వాగ్దానములు భద్రపరచబడుట (20:1–18)
J. ఇస్సాకు యొక్క జననము (21:1–7)
K. ఇస్సాకు మరియు ఇష్మాయేలుల మధ్య ఉద్రిక్తత (21:8–21)
L. అబీమెలెకుతో అబ్రాహాము యొక్క ఒప్పందము (21:22–34)
M. అబ్రాహాము విశ్వాసమునకు పరీక్ష: తన కుమారుడైన ఇస్సాకును బలి ఇచ్చుటను గూర్చిన పిలుపు (22:1–24)
N. శారా యొక్క మరణము (23:1–20)

O. దేవుని దైవకృతము ప్రదర్శించబడుట: ఇస్సాకు కొరకు ఒక భార్య (24:1–67)
P. అబ్రాహాము యొక్క చివరి దినములు (25:1–11)
Q. ఇష్మాయేలు యొక్క సంతతివారు (25:12–18)

III. ఇస్సాకు యొక్క వృత్తాంతము (25:19–28:9)
A. ఏశావు మరియు యాకోబుల జననము (25:19–26)
B. ఏశావు జేష్ఠత్వపు హక్కును పొందుకొనుటకుయాకోబు అతనితో బేరమాడుట (25:27–34)
C. ఫిలిష్తీయుల మధ్య ఇస్సాకు నివాసము (26:1–33)
D. ఏశావు యొక్క హిత్తీయులకు చెందిన భార్యల వలన ఇస్సాకు మరియు రిబ్కాల శోకము (26:34, 35)
E. ఏశావు ఆశీర్వాదమును యాకోబు దొంగిలించుట (27:1–45)
F. హారానుకు వెళ్లకముందు యాకోబుకు ఇస్సాకు ఇచ్చిన ఆజ్ఞ (27:46–28:5)
G. ఇస్సాకును సంతోషపరచుటకు ఏశావు ఆలస్యముగా చేసికొనిన వివాహము (28:6–9)

IV. యాకోబు యొక్క వృత్తాంతము (28:10–36:43)
A. బేతేలు యొద్ద యాకోబు: ఒక దైవ ప్రత్యక్షత మరియు ఒక మ్రొక్కుబడి (28:10–22)
B. యాకోబు యొక్క వివాహములు (29:1–30)
C. లేయా మరియు రాహేలుల మధ్య శత్రుత్వము (29:31–30:24)
D. మందల నిమిత్తము లాబానుతో యాకోబు యొక్క ఒప్పందము (30:25–43)
E. లాబాను యొద్ద నుండి యాకోబు మరియు అతని కుటుంబము వెళ్లిపోవుట (31:1–55)
F. ఇరవై సంవత్సరముల తరువాత ఏశావు మరియు యాకోబుల కలయిక (32:1–33:17)
G. షెకెమునకు యాకోబు మరియు అతని కుటుంబము వెళ్లుట (33:18–34:31)
H. బేతేలునకు తిరిగి వచ్చుట (35:1–15)
I. బేతేలు తదనంతరము జరిగిన విపత్తు (35:16–29)
J. ఏశావు సంతతివారు (36:1–43)

V. యోసేపు యొక్క వృత్తాంతము (37:1–50:26)
A. కనాను దేశములో యోసేపు (37:1–36)
B. యూదా మరియు అతని కోడలు తామారు (38:1–30)

C. పోతీఫరు గృహములో దాసునిగా యోసేపు (39:1–23)
D. చెరసాలలో యోసేపు (40:1–23)
E. ఫరో యొక్క మర్మయుక్తమైన కలలు (41:1–57)
F. ఐగుప్తులో యోసేపు సహోదరులు (42:1–38)
G. ఐగుప్తుకు సహోదరులు తిరిగి వచ్చుట (43:1–34)
H. ప్రమాదములో బెన్యామీను (44:1–34)
I. తన సహోదరులతో యోసేపు పునరేక మవుట (45:1–28)
J. ఐగుప్తుకు యాకోబు కుటుంబము వలన వెళ్లుట (46:1–47:12)
K. కొనసాగుచుండిన కరువు (47:13–26)
L. యాకోబు యొక్క చివరి దినములు (47:27–48:22)
M. యాకోబు తన కుంరులకు ఇచ్చిన మరణ శయ్య ఆశీర్వాదములు (49:1–27)
N. యాకోబు యొక్క మరణము మరియు సమాధి (49:28–50:14)
O. యోసేపు యొక్క చివరి సంవత్సరములు (50:15–26)

---

సూచనలు

[1]సెప్టుజెంట్ అనునది హెబ్రీ లేఖనముల యొక్క గ్రీకు అనువాదమైయున్నది. దీనినే సామాన్యముగా "LXX" అని అంటారు. "డెబ్బయి" అని దీని భావము. ఈ అనువాదము, దాదాపు క్రీ.పూ. 250లో అలెక్సాండ్రియాలో డెబ్బయి మంది పండితుల ద్వారా చేయబడినది. [2]Mishnah *Aboth* 1.1. [3]Mark Zvi Brettler, "Torah," in *The Jewish Study Bible*, ed. Adele Berlin and Marc Zvi Brettler (New York: Oxford University Press, 2004), 2–3. [4]1 రాజులు 2:3; 2 రాజులు 14:6; 23:25; 2 దిన. 23:18; 25:4; 30:16; 35:12; ఎజ్రా 3:2; 6:18; నెహెమ్యా 8:1; 13:1 చూడుము. క్రొత్త నిబంధనలో కూడా మోషేను గురించి ఇటువంటి వాక్య భాగములు కలవు (మార్కు 12:26; లూకా 2:22; 24:44; యోహాను 1:45; 7:23; అపొ. 13:39; 15:5; 28:23; 1 కొరింథీ. 9:9; మొదలగునవి). [5]మోషే మరియు నిర్గమమునకు రెండు సాధ్యమైన తేదీలు ఇవ్వబడ్డాయి. మొదటి తేదీ దాదాపు క్రీ.పూ. 1445, మరియు తదుపరి తేదీ దాదాపు క్రీ.పూ. 1290. ఈ తేదీల యొక్క బలములు మరియు బలహీనతలను గూర్చిన చర్చ వాస్తవమునకు నిర్గమకాండములోని చారిత్రక సంఘటనలను గూర్చిన అధ్యయనమునకు చెందినది. దీని కొరకు ఈ పుస్తకములను చూడుము: Alfred J. Horeth, *Archaeology and the Old Testament* (Grand Rapids, Mich.: Baker Books, 1998), 57–59; K. A. Kitchen, *On the Reliability of the Old Testament* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 2003), 307–10; and Coy D. Roper, *Exodus*, Truth for Today Commentary (Searcy, Ark.: Resource Publications, 2008), 656–59. [6]ఈ మూలములలో వంశావళులను గుర్చిన వృత్తాంతములు కూడా చేర్చబడియుండవచ్చు (5–6 పేజీలు చూడుము). [7]దైవ ప్రేరేపితము కాని అపోక్రిఫ గ్రంథములోని ఎజ్రాను గూర్చి కనుగొనిన తొలి యూదుల సంప్రదాయమునుండి అతడే

రాసాడని కొందరు ఊహించారు: 2 Esdras 14:42–48 ప్రకారము 94 పుస్తకాలను రచించి, మొదటి 24 పుస్తకాలను బహిరంగపరచాలని ఎజ్రాకు మరియు ఇతర ఐదుగురికి ఆజ్ఞాపించెను (ఒక సంప్రదాయ లెక్కింపు ప్రకారము హెబ్రీ ప్రామాణిక గ్రంథములోని 24 పుస్తకాలు). [8]అబ్రాము పేరు దేవుని వలన "అబ్రాహాము"గా మార్చబడినది (17:5). అతను అనేక జనములకు తండ్రి అవుతాడని ఇది సూచించుచున్నది. ఈ తరువాత, ఎక్కువగా తెలియబడిన పేరు ఈ వ్యాఖ్యానమంతటిలో ఉపయోగించబడెను. 9ఒక సాధ్యమైన మినహాయింపు క్రీ.పూ. [9]25కు చెందిన ఐగుప్తు యొక్క Shoshenq I (Shishak) యొక్క స్థలాకృత (topographical) జాబితాలో కనుగొనబడినది. దానిని ఈ విధముగా అనువదించవచ్చు: "అబ్రాము యొక్క వాస స్థలము." ఇది నెగెవును గూర్చి (ఇశ్రాయేలు యొక్క దక్షిణ ఎడారిని గూర్చి) చెప్పుచుండవచ్చు. కానీ అది "మగ గుర్రముల యొక్క వాస స్థలము," అని కూడా అనువదించవచ్చు. అయితే, "ఈ స్థలము ఉండిన నెగవు ప్రాంతము గుర్రముల విషయములో సరిగ్గా ప్రసిద్ధిగాంచినది కాదు," అని K. A. Kitchen గమనించెను (Kitchen, *Reliability*, 313). [10]Hoerth, 142.

[11]K. A. Kitchen, *Ancient Orient and Old Testament* (Chicago: Inter-Varsity Press, 1966), 48–49; Gordon J. Wenham, *Genesis 16–50*, Word Biblical Commentary, vol. 2 (Dallas: Word Books, 1994), xxiii. [12]Kitchen, *Reliability*, 341–42. [13]Wenham, 175–76. [14]అబ్రాహాము నూజీ (Nuzi) పలకల కాలము (క్రీ.పూ. అయిదవ శతాబ్దము) కంటే అనేక వందల సంవత్సరముల ముందే జీవించినప్పటికీ, రెండవ సహస్రాబ్దములోని పురాతన మెసొపొతమియ సంస్కృతి యొక్క అచేతన స్థితిని బట్టి చూస్తే, ఆ పలకలు వాటికంటే అనేక సంవత్సరముల ముందట మరియు వెనకటి కాలముల యొక్క సాంస్కృతిక పద్ధతులకు అద్దము పడతాయని తెలిసికొనవచ్చు. (Hoerth, 102–3, n. 1.) [15]ఆదికాండములోని వివిధ మతపరమైన అంశములైన దేవుడు, సృష్టి, మానవుడు, పాపము, కృప, మొదలగువాటిని గూర్చిన విభాగముగా కాకుండా, ఈ విభాగములో వివిధ అధ్యాయములు లేక భాగములలో ఉన్న మతపరమైన బోధనలను గూర్చిన క్లుప్తమైన చర్చ ఉంటుంది. రచన మరియు వ్యాఖ్యానము కొరకైన కొన్ని ఆలోచనలు ఈ పుస్తకము నుండి తీసికొనబడినవి: Clyde T. Fransisco, "Genesis," in *The Broadman Bible Commentary*, vol. 1, *General Articles, Genesis–Exodus*, rev. ed., ed. Clifton J. Allen (Nashville: Broadman Press, 1969), 115–16. [16]హారానును వదిలివెళ్లినప్పుడు అబ్రాహాము యొక్క వయస్సు 75 సంవత్సరములు (12:4), మరియు అతను శారా కంటే పది సంవత్సరములు పెద్దవాడు. శారా తొంభై సంవత్సరముల వయస్సు ఉన్నప్పుడు మరియు అబ్రాహాము నూరు సంవత్సరముల వయస్సు ఉన్నప్పుడు, ఆమె ఇస్సాకుకు జననమిచ్చెను (17:17; 21:5). శారా 127 సంవత్సరములు వయస్సులో చనిపోయినప్పుడు (23:1), అబ్రాహాము 137 సంవత్సరములు గలవాడు. అప్పటికి అతను హారానును విడచివెళ్లి అరవై రెండు సంవత్సరములు అయినది. [17]యాభై సంవత్సరములకు ముందు, అతను తన యింట పుట్టిన 318 మంది పోరాడు మగవారిని పోగుచేసెను (వారు బహుశ దాసులైయుండవచ్చు; 14:14). ఈ కాలమునకు, అతనికి అవసరమైతే పోరాడగలిగే మరింత మంది పరిచారకులు/దాసులు ఉండియుండవచ్చు.